గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సెప్టెంబర్2017
# కథలు




“ఆల్ ద పాసంజర్స్ హూ ట్రావెల్డ్ ఇన్ ఫస్ట్ క్లాస్ కంపార్ట్ మెంట్ రిక్వెస్ట్ డ్ నాట్ టు లీవ్ ద స్టేషన్ .. అండ్ ఆల్ అర్ రిక్వెస్టెడ్ టు కం టు ఫస్ట్ క్లాస్ వెయిటింగ్ రూం ఇమ్మీడియట్లీ.”

బయటకు బయలు దేరిన డిటెక్టివ్ బాలీ ప్రశ్నార్థకంగా అవినాష్ ను చూసాడు.

“బాస్ !నేను వెళ్ళి ఎమర్జెన్సీ ఏమిటో చూసివస్తాను.మీరు స్టేషన్ మాస్టర్ కేబిన్లో వెయిట్ చేయండి.”

మరో మాటకు తావీయకుండా దూసుకుపోయాడు అవినాష్.

“ప్లీజ్ కమిన్ సర్. మిమ్మల్ని ఫోటోల్లో చూడ్డమే తప్ప ప్రత్యక్షంగా కలుసుకోలేదు.గ్లాడ్ టు మీట్ యు సర్.”

“గ్లాడ్ టు మీట్ యు ..వాట్ ఈజ్ దిస్ అనవున్స్ మెంట్?

“ ఫస్ట్ క్లాస్ కంపార్ట్మెంట్ లో ఓ    హైదరాబాద్ పాసింజర్    ఫౌండ్ డెడ్. పోలీసులకు ఇన్ఫామ్..చేశాను. ఫార్మాలిటీస్ అయిపోగానే..”

“హైదరాబాద్    వ్యక్తా? కెన్ యూ టెల్ మీ ద నేమ్?“ప్లీజ్ వెయిట్ సర్ ! ఐ విల్ గెట్ హిజ్ ఫుల్ డీటెయిల్స్ .” అవినాష్ వచ్చేసాడు.

“బాస్ !చనిపోయిన వ్యక్తి మన పాత క్లైంట్ జగన్నాధంగారు.

రాత్రి మనం    ట్రైన్ ఎక్కే టప్పుడు    మనతో కలిసారు . మీరు కేస్ సాల్వ్ చేసాక నా ప్రాజెక్ట్ చాలా బాగుంది ..మార్నింగ్ కలుస్తానన్నారు యింతలో ..

“బాలి సర్ !దిస్ ఈజ్ హిజ్ ఆధార్ నంబర్ .“ అంటు తన సెల్లు కొచ్చిన వాట్సప్ మెసేజ్ చూపించాడు.

“అవినాష్ మెసేజ్ శిరీషకు ఫార్వర్డ్ చేసి జాకీ స్టెల్లాల్ని కేస్ టేకప్ చేయమని చెప్పు .అవినాష్ ! ఐ వాంట్ టు సీ ద కూపె.” అచేతనంగా బెర్త్ మీద వున్న జగన్నాధం డెడ్ బాడీ ని చూస్తూ మూడీ అయిపోయాడు బాలి.

అవినాష్ ! టేక్ క్లోజ్ ఫొటోస్ ..షుడ్ నాట్ లీవ్ మైనర్ థింగ్ అల్సో .

“ సర్! మీరు స్టే చేస్తానంటే ఫస్ట్ క్లాస్ ఏసి సూట్ అరేంజ్ చేస్తాను. మా డిపార్టుమెంటు జియం కోసం రెండు సూట్స్ రిజర్వు లో వుంటాయి యిది మర్డరో ఆత్మహత్యో ? మీకు తెలిసిన వ్యక్తే .మీరు మాతో వుంటే మాకు ధైర్యం. మీరు ఓకే అంటే నేను డిపార్టుమెంటు లో మాట్లాడి ...”

“ఓకే ..మిస్టర్ ..

“సెల్వరాజ్ సర్ “

“ఐ విల్ గోటు రిటైరింగ్ రూం .”

వెయిటింగ్ రూం మొత్తం పాసింజర్లు వాళ్ళ లగేజితో క్రిక్కిరిసి పోయింది. ప్రక్కనే వున్న టీసీ రూం లో సెటిలై పోయాడు బాలి అవినాష్ తో.

అవినాష్..    ఏవన్ కంపార్ట్మెంట్ పాసెంజర్స్ లిస్టు బాలి ముందు ఉంచాడు.

“బాస్ ! మర్డర్ జరిగిన కూపె లో మొత్తం సీట్స్ నాలుగు.నంబర్ త్రి బెర్త్ జగన్నాధంది.”

“ అవినాష్ !ఆ ముగ్గుర్నీ తీసుకురా . మిగతా వాళ్ళతో    తర్వాత    మాట్లాడుదాం .

“సర్ ! నా పేరు రవీంద్రనాథ్ ..నేను హైదరాబాద్ నుండి వస్తున్నాను నా బెర్త్ నెంబర్ వన్”

“సర్    మై నేమ్ ఈజ్ రామనాధన్..మద్రాసీ .బెర్త్ నెంబర్ టు.”

“జి !మేరా నామ్…లతీఫ్ హైదరాబాద్ సె ఆరుం. బెర్త్ నెంబర్ చార్.”

“మీరంతా జగన్నాధం గారితో కలిసి ట్రావెల్ చేశారు. మీతో ఆయన ఏమైనా    మాట్లాడారా ? ఏదైనా స్పెషల్ అనిపించిన విషయాలు గమనించి వుంటే చెప్పండి.” అందరూ మౌనంగా వుండిపోయారు.

రవీంద్రనాథ్ ఏదో చెప్పాలని ఆగిపోయాడు.

“మిస్టర్.రవీంద్రనాథ్ ! ఇది పోలిస్ కేస్.యిప్పుడు నాకు చెప్పక పోయినా రేపు పోలిస్ ముందు చెప్పక తప్పదు.నాపేరు బాలి ప్రైవేటు డిటెక్టివ్ ని. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీ లో మా థర్డ్ ఐ డిటెక్టివ్ ఏజెన్సీ ఆఫీస్ వుంది. “

“ విన్నాను బాలీసర్. ప్రత్యేకవిషయం కాదుగానీ ఆయన వచ్చినప్పటినుండి కొంచెం టెన్షన్ లోనే వున్నారు.పడుకో బోయే ముందు వరకు కూడా ఫోనులో మాట్లాడుతూనే వున్నారు. “

“ఓకే !మిస్టర్ రవీంద్రనాథ్..ఆయన లగేజ్ మీకు గుర్తుందా ?”

సారీ సర్ !

“ సర్ !”అర్ధరాత్రి ..”

రామనాథం బాలికి రహస్యంగా ఏదో చెప్పాడు.” బాలి రింగ్ చేసాడు.

“అవినాష్ !జగన్నాధం లగేజ్ ట్రేస్ అవుట్ చేసారా?”

“ఎస్ బాస్ ! వన్ సూట్ కేస్ ..వన్ బాగ్..రైల్వే పోలిస్ భద్రం చేశారు.” ఆ ముగ్గురుని చూస్తూ బాలి ప్రశ్నించాడు.

“మీరు క్యాటరింగ్ కు ఆర్డర్ చేసారా? లేక “

“ఈ సాబ్ తప్ప మేము యిద్దరమూ డిన్నర్ ఆర్డర్ చేసాము . జగన్నాధం సర్ మాత్రం తనకు లైట్ గా ఉంటుందని కర్డ్ రైస్ ఆర్డర్ చేశారు .”

రవీంద్రనాథ్ చెప్పాడు.

“సర్ !మై నే ఘర్ సె చపాతి లాయా సాబ్.” లతీఫ్ చెప్పాడు.

“మిస్టర్ లతీఫ్ జగన్నాధం సర్ కి ఒక చపాతీ షేర్ చేశారు సర్. రామనాధం అల్సో పికిల్ షేర్ చేశారు. నేను స్వీట్ ఆఫర్ చేయబోతే హెవీ అయిపోయిందని తీసుకోలేదు .” అవినాష్ వచ్చి..

“బాస్ ! బంజారా హిల్స్ లో జగన్నాధం యింటిని ట్రేస్ అవుట్ చేసి జగన్నాధం గారి భార్యతో మాట్లాడారట . ఆమె చెప్పిన స్టేట్మెంట్ ప్రకారం నిన్న౦తా జగన్నాధం గారు ఎస్బిఐ బంజారా హిల్స్ బ్రాంచ్ లో వున్నారట. ఆ విషయం బ్రాంచ్ మేనేజర్ తో మాట్లాడి ధృవీకరించు కున్నామని జాకీ రిపోర్ట్.”

“ఓకే !బ్రింగ్ క్యాటరింగ్ బాయ్.”

“నీ పేరు?”

“ననగె తెలుగు గొత్తిల్ల సర్ .స్వల్ప అంగ్రేజి బరత్తే.”

“వాట్ ఈజ్ యువర్ నేమ్?”

“”హలేమనే సర్.”

“..ఓకే ..నైట్ యు ఓన్లీ సర్వేడ్ ద ఫుడ్ ?

“హౌదు సర్ ! నానే సర్వ్ మాడితీని . హలేమనే జవాబిచ్చాడు..

“బాస్! నిన్న జగన్నాధంగారు బ్యాంకు నుండి మనీ డ్రా చేసారట.

“ఓకే అవినాష్! గెట్ బ్యాంకు మేనేజర్ ఫుల్ డిటెయిల్స్ ..యెంత కాష్ డ్రా చేసారో తెలుసుకో. ట్రై టు గెట్ పోస్ట్ మార్టం రిపోర్ట్ .డెత్ కారణం తెలియాలి.”

“బాస్ ! ఐ విల్ మీట్ మిస్టర్ శివకుమార్ .”

*******

స్టేషన్ మాస్టర్ ప్రోవైడ్ చేసిన ఎసి సూట్ లో అవినాష్ తో సెటిలై పోయాడు బాలి

“బాస్! జగన్నాధంగారి మరణానికి కారణం విషప్రయోగం .”

“ఐ సి ..అంటే ఈ కేసులో...”

“నెంబర్ వన్ సస్పెక్ట్ హలేమనే.

నెంబర్ టు పాంట్రీ కార్ జనాలు.

నెంబర్ త్రి బ్యాంకు మేనేజర్.

మిగిలింది ముగ్గురు జగన్నాధం కోపాసెంజర్స్.”

“బాస్! క్యాటరింగ్ హలేమనే తెచ్చిన కర్డ్ రైసులో డెలివరీ కంటే ముందే పాయిజన్ కలిసివుండాలి . ఇది ప్రిప్లాన్డ్ మర్డర్ అనుకుంటే

పాంట్రీ లో కాని పాంట్రీ టు కంపార్ట్మెంట్ డెలివరీ టైం లో కాని జరిగుండాలి. లేదా కో పాసింజర్స్ ఇద్దరు జగన్నాధం గారికి ఆఫర్ చేసిన చపాతీ పికిల్స్ లో పాయిజన్ కలిపుండాలి . కో పాసింజర్స్ కూడా అనుమానితులే."

"ఒక్కసారి జాకీని లైన్ లోకి తీసుకో."

"జాకీ !నేను చెప్పింది అర్ధమైందా ? కాష్ విషయం అతనికొక్కడికే తెలుసు. ప్లాన్ చేసి వుండొచ్చు.నువ్వు బ్యాంకును మేనేజర్ ని కవర్ చెయ్. స్టెల్లా శిరీషలు మేనేజర్ యింటిని కవర్ చేసి నేను చెప్పిన వివరాలు వాట్సప్ లో పంపించాలి."

"బాస్! సెల్వరాజ్ ఫోన్. హత్య జరిగిన కూపే లోని ముగ్గురుని తప్ప మిగతా ఫస్ట్ క్లాస్ పాసెంజర్స్ ని అడ్రస్ లు తీసుకొని పంపించేయాలని క్రైంబ్రాంచ్ ఎస్పీ శివకుమార్ ఆర్డర్ .మీకు చెప్పమని"

"ఓకే అవినాష్! వాళ్లు మన ఫైనల్ లిస్టులో లేరు. కానీ ఒక్కసారి నేను వాళ్ళను కలవాలి.

******

వచ్చిన వాట్సప్ క్లిప్పింగ్స్ లాప్టాప్ మానిటర్ కు అనుసంధానం చేసాడు అవినాష్. ఒక క్లిప్పింగ్స్ చూపిస్తూ అవినాష్ తో..

"అవినాష్ వీడే హంతకుడు. " జాకీకి చెప్పు

"జగన్నాధం భార్య ని కూడా తీసుకుని అవైలబుల్ ఫ్లైట్ కు రమ్మను. నేను శివకుమార్ ను కలిసి వస్తాను. జాకీ వచ్చే టైం కే ఈ కేస్ క్లోజ్ చేయాలి. మన క్లైంట్ కు రేపు మీట్ అవుతామని మెసేజ్ పంపించు. నువ్వు ఏసిపిశాండిల్యాను కలిసి నేను చెప్పింది చెప్పు.

*******

వెయిటింగ్ రూం పోలీస్ ఫోర్స్ తో న్యూస్ ఛానళ్ళ జనాలతో జగన్నాధం భార్యతోవచ్చిన బంధువులతో నిండిపోయింది.

హలేమనే బిక్క ముఖంతో ఎడ్చేసాడు. ముగ్గురు పాసింజర్స్ భయంగా బాలి ముఖాన్ని చూస్తున్నారు. శాండిల్య లైన్ లోకి వచ్చాడు.

"బాలి !నువ్వు చెప్పిన లైన్లోనే ఇంటరాగేట్ చేస్తున్నాము.హేవ్ లుక్ ఇన్ యువర్ సెల్. "

"ఒన్ మినిట్ శాండిల్యా ..అవినాష్ నా సెల్ మానిటర్ కు కనెక్ట్ చెయ్.అందరూ చూడాలి. " మానిటర్లో శాండిల్య క్యాబిన్.

"మీ మాటలు ఎలా నమ్ముతాను ?మీకూ జగన్నాధం గార్లకు మాత్రమే మనీ విషయం తెలుసు. డబ్బు కో సమే ఈ హత్య జరిగింది. మీరే ప్లాన్ చేసి వుంటారు? జగన్నాధం గారు అయిదు కోట్ల మనీ డ్రా చేసారని మీకూ మీ బ్యాంకు సిబ్బందికి తప్ప మరో వ్యక్తికి తెలిసే అవకాశం లేదు.మీకు తప్ప మరో వ్యక్తికీ మర్డర్ చేయవలసిన అవసరమూ లేదు. ఎవరితో మర్డర్ చేయించారు?"

"సర్ !నేను మర్డర్ చేయించలేదు .నన్ను నమ్మండి. నా స్టాఫ్ కు జగన్నాధం గారు చెన్నై ఎక్స్ ప్రేస్ లో చెన్నై వెళుతున్నారనే విషయం తెలియదు. జగన్నాధం గారు గత ముప్పై సంవత్సరాలనుండి మా బ్యాంకు కస్టమర్. నాకు చాలా క్లోజ్ ."

"అయినంత మాత్రాన మర్డర్ చేయకూడదన్న రూలేమైనా వుందా?" మేనేజర్ ఆందోళనలో పడ్డాడు.

"ఇక్కడ ఇన్వాల్వ్ అయ్యింది ఐదుకోట్ల డబ్బు.

ఓకే మీరు యిప్పుడు చెపుతారా ? పోలీస్ మర్యాదల తర్వాత చెపుతారా మీ యిష్టం."

ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు మేనేజర్ .అతని భార్యా పిల్లలు అతన్ని చుట్టుకుపోయారు. పిల్లల ఏడుపులతో శాండిల్య కేబిన్ దద్దరిల్లి పోయింది.

మానిటర్ లో దృశ్యాలు చూస్తున్న అందరి ముఖాలూ బాధతో నిండిపోయాయి.

“కానిస్టేబుల్స్ టేక్ హిం టు కస్టడి.”

చేతిలో సంకెళ్ళతో వస్తున్న పోలిస్ ను చూస్తూనే మేనేజర్ భార్య స్పృహ తప్పి పడిపోయింది.చిన్న పిల్లలిద్దరూ అమ్మా! అమ్మా! అంటు తల్లిని చూస్తూ ఏడ్చేస్తుంటే వెయిటింగ్ రూం మానిటర్ లో చూస్తున్న ప్రేక్షకులంతా దాదాపు కళ్ళనీళ్లపర్యంతమైపోయారు. అందరూ

“అయ్యో పాపం ..ముక్కుపచ్చలారని పసిపాపలు. ఈ మేనేజర్ వెధవ పోయేకాలం వచ్చి ఈ హత్య చేసాడు. రేపటి నుండి ఆ ఇల్లాలు పసి పిల్లలతో ముష్టి ఎత్తుకోవాలి. ఛీ ! నీబ్రతుకు చెడ..”

దుమ్మెత్తి పోస్తుంటే ..అందరిని తోసుకుంటు ఓ వ్యక్తి హటాత్తుగా బాలి ముందుకొచ్చి

“ సార్ మా అన్నయ్య ను అరెస్ట్ చేయవద్దని చెప్పండి ప్లీజ్ ..నేనే దొంగతనం చేశాను. స్పృహ తప్పించాలనుకున్నాను కానీ చంపాలనుకో లేదు. నేనే హంతకుడిని. .నన్ను అరెస్ట్ చేయండి.” బాలి పెదాలమీద చిరునవ్వు అలా మెరిసి యిలా అదృశ్యమై పోయింది.

“అది నాకు తెలుసు ..ఎందుకు చేసావు ? ఎలా చేసావు?

“సర్ !నిన్న సాయంకాలం అన్నయ్య బ్యాంకు నుండి వచ్చాడు మాటల మధ్య.. “యేరా! ఇవ్వాళ నీ డ్యూటీ ఏట్రైన్ లో అనిఅడిగితే చెన్నైఎక్స్ ప్రెస్సు” లో అని చెప్పాను. మా క్లైంట్ జగన్నాధం గారు కూడా అదే ట్రైన్ లో వస్తున్నారు. ట్రైన్ లో కాష్ డేంజర్ అని చెప్పాను. నాకిది మామూలు విషయమే అన్నారు. అయినా ..కాలం బాగా లేదు. వీలయితే నువ్వు కొంచెం చూసుకో .. ఆయన మాకు మంచి క్లైంట్ అని చెప్పాడు. అప్పుడు నాలో దుర్బుద్ధి పుట్టింది.

అతన్ని స్పృహ తప్పించి డబ్బు కొట్టేసి డబ్బు సంపాదించి బెట్టింగు గేంగు నుండి నా ఫ్యామిలీ ని రక్షించుకో వచ్చని అర్ధరాత్రి వచ్చి పెదాల మీద లిక్విడ్ పోశాను. మళ్ళీ వెళ్ళి బ్రీఫ్ కేస్ దొంగతనం చేసాను. ఎవరూ నన్ను పట్టుకోలేరని భావించాను."

" సర్ ! మా టిసి హంతకుడని మీరు ఎలా ?" సెల్వరాజ్ ప్రశ్నకు

" మా టికెట్స్ చెక్ చేస్తున్నప్పుడు మీ టీసీ సెల్ ఫోన్ లో క్రికెట్ మేచ్ చూస్తూ చాలా అందోళనగా కనిపించాడు.

సర్ ! మీరేమైనా క్రికెట్ బెట్టింగ్ పెట్టారా ? అని మా అవినాష్ అడిగితే అందుకే కదా ఈ టెన్షన్ అని చెప్పి టికెట్స్ చెక్ చేసుకొని వెళ్ళి పోయాడు. మొన్నిమధ్య గుంటూరు లో క్రికెట్ బెట్టింగులో మని పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకున్న ఇరవై సంవత్సరాల యువకుడు గుర్తుకొచ్చాడు. క్రికెట్ బెట్టింగ్స్ గ్యాంగ్ ఆగడాల మూలంగా లో ఎందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మావాళ్ళు మేనేజర్ హిస్టరీ తిరగేస్తుంటే యితని బెట్టింగ్ వ్యసనం తెలిసింది. పోతే హలేమనే. టెండర్ ఏజ్ ..పొట్టకూటి కోసం కర్నాటక నుండి వచ్చాడు. సామాన్యంగా ఆ ఏజ్ గ్రూప్ పిల్లలలో మర్డర్ చేయాలన్న ఆలోచన వుండదు.

పాంట్రీ కార్ సిబ్బందిని ధరోగా చెక్ చేశాము.అందరూ తమిళియన్స్. బ్యాంకు మేనేజర్ తో సంబంధం సాధ్యంకాని సంగతి. ముగ్గురు కోపాసింజర్స్ సమాజంలో వున్నత స్థానాల్లో వున్నారు. ముగ్గురి హిస్టరీని నా ఫ్రెండ్ ఏసిపిశాండిల్య చెక్ చేసారు. మా స్టెల్లా శిరీషలు పంపించిన మేనేజర్ ఇంటిలోని ఈ యిద్దరి ఫోటో వాట్సప్ లో చూడగానే టీసీ , మేనేజర్ బ్రదర్స్ అని గ్రహించాను.మని మేటర్ లీక్ అయ్యిందని అర్ధమైపోయింది ? అన్న జగన్నాధంగారి రక్షణ కోసం చెపితే..తమ్ముడు హత్యకు వుపయోగించుకున్నాడు.. స్టేషన్ మాస్టర్ తోవెళ్ళి నీబాక్స్ చెక్ చేస్తే బెడ్ షీట్లో దాచిన బ్రీఫ్ కేస్ దొరికింది."

నేనే హంతకుడినని గుర్తించి కూడా మా అన్నయ్యను ఫ్యామిలీ ని ఎందుకు బాధ పెట్టారు సర్ ? వాళ్ళు నాకు తల్లితండ్రులతో సమానం "

బేలగా అన్నాడు.

"మేము డైరెక్ట్ గా అడిగితే కధలు చెపుతావు. ఖాకీలు లాటీలతో ఆడుకుంటే అప్పుడు కక్కుతావు నిజాలు.అదే సెంటిమెంట్

అయితే ? ఎదురుగా అన్నావదినలు..చిన్నారి పాపలు. యెంతటి హంతకుడైనా బంధాలనుండి తప్పించుకోలేడు. అదే జరిగింది.

క్రికెట్ బెట్టింగుల్లో పోగొట్టుకున్న డబ్బును సంపాదించాలన్న మోటివ్ తో హత్య చేసావు..

సాటి తెలుగు వాడిని తమిళ లాటీలతో కొట్టించడం యిష్టం లేకే ఈ నాటకం శాండిల్యతో ఆడించాను.

రామనాధం బాత్ రూంకు వెళ్ళిన టైం లో కూపే లోకి వెళ్లావు ..కానీ ఆయన కూపే లోంచి వస్తున్న నిన్ను చూశానని చెప్పారు..అలాగే మరో సారి మరో వ్యక్తి బాత్ రూం కు వెళ్ళిన టైంలో బ్రీఫ్ కేస్ కొట్టేసావు."అందరి కరతాళధ్వనుల మధ్య శివకుమార్ బ్రీఫ్ కేస్ జగన్నాధం భార్య కు అందించారు.

"ఒక్క రోజులో హత్య కేస్ సాల్వ్ చేసిన డిటెక్టివ్ బాలి గారికి మా డిపార్టుమెంటు తరఫున అభినందనలు." స్టేషన్ మాస్టర్ సెల్వరాజ్ షేక్ హ్యాండ్ యిచ్చి కౌగలించుకున్నాడు *



రెడ్డమ్మా! బాగున్నావా?"

పేరు పెట్టి పిలిచింది ఎవరా అని వెనక్కి తిరిగి చూసింది రెడ్డమ్మ .

"నువ్వా ... బాగున్నావా బావా ? ఎన్ని రోజులయ్యింది నిన్ను చూసి ... "

"దాదాపు ఇరవై సంవత్సరాలు అయింది కదా ? " అన్నాను నేను .

"అవును ".. ఆమె కళ్ళల్లో కన్నీరు ... దాచడానికి ప్రయత్నిస్తోంది.

నాకు గూడా ఆమెను చూసిన వెంటనే మనసంతా బాధగా ఉంది .

"మోహన్ ... పిల్లలు ఎలా ఉన్నారు ?"

"అంతా బాగానే ఉన్నారు .. ఎప్పడు వచ్చావు నువ్వు హైదరాబాద్ నుండి ? "

తిరుపతికి పని మీద వచ్చాను . అలాగే స్వామి దర్శనం చేసుకొని , నువ్వు ఎలా ఉన్నావో అని చూసి పోవడానికి వచ్చాను.

"భోజనం చేసి వెళ్ళాలి. ఆయన గూడా కొంత సేపట్లో వస్తారు . పిల్లలు స్కూల్ కె వెళ్లారు "

"ఆబ్బే .. పరవా లేదు. . "

రెడ్డమ్మ నాకు మేనత్త కూతురే అవుతుంది . మా నాన్న చెల్లెలి కూతురు. వరసకి మరదలు. మేమంతా చిన్నప్పుడు మా పల్లెలో పక్క పక్క ఇళ్లల్లో ఉండే వాళ్ళం , రోజంతా స్కూల్ కి వెళ్లడం , సాయంకాలం ఆడు కోవడం , పొలాల వెంబడి గంతు లెయ్యడం ,చెట్లు ఎక్కి కోతి కొమ్మచ్చి ఆడడం .. ఇలా మా బాల్యం గడచి పోయింది .

రెడ్డమ్మ ఎంత అందంగా ఉండేది అంటే .. పల్లెలోని వాళ్లంతా ఆమెను నిలబడి చూసే వాళ్ళు. ఒక సారైనా ఆమెతో మాట్లాడాలని ఉవ్విళ్లూరే వారు. ముఖంలో తరగని చిరు నవ్వు, మెరిసే విశాల మైన కళ్ళు, చక్కటి గుండ్రని ముఖం. ఏ దేవతో తప్పయి ఈ పల్లెలో పుట్టిందా అనిపించేది. నా మరదలు అయినందుకు ఊర్లో వాళ్ళు నన్ను గేలి పట్టిచ్చే వారు. "నీకేమోయ్ .. రంభ లాంటి పెళ్ళాం రెడీ గా ఉంది అనే వాళ్ళు". నేను గూడా రెడ్డమ్మ ను పెళ్లి చేసు కోవాలని కలలు కనే వాడిని. కానీ ఏనాడూ హద్దు మీరి ప్రవర్తించింది లేదు . స్కూల్ కి వెళ్లి ఇంటికి వచ్చేంత వరకు ఆమెకు బాడీ గార్డ్ గా ఉండే వాడిని.

రెడ్డమ్మ ఇపుడు కృశించి పోయిన ముఖం తో చాలా అనారోగ్యంగా ఉంది . ఆమె ముఖంలో ఆ కళ లేదు. కళ్ళు తేలి పోయి నట్లు నిర్జీవంగా ఉన్నాయి. ముఖంలో న్యుమోనియా రోగం వచ్చినట్లు పాలిపోయింది. సరయిన ఆహారం , విశ్రాంతి లేనందు వలనో, లేదా కుటుంబ పరిస్థితుల వల్లనేమో ఆమె అనారోగ్యంగా ఉంది .

ఇల్లు చాలా ఇరుకిరుగా ఉంది. ఒక హాల్ , ఒక కిచెన్ తప్ప ఏమి లేదు. అంత పెద్ద భూస్వామి కొడుక్కిచ్చి పెళ్లి చేసాడు మా మామయ్య . వాళ్ళ ఆర్థిక పరిస్థితి చూసి చలించి పొయ్యాను.

"ఎందు కిలా అయి పోయావు ? ఎంత చక్కగా ఉండే దానివి ?"

రెడ్డమ్మ పద్మావతి ఉమెన్స్ కాలేజ్ లో బి ఏ లో చేరినపుడు , నేను బీకామ్ లో చేరాను శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో .ఆక్కడే సరదాగా అప్పుడప్పుడు కలిసే వాళ్ళం .

రెడ్డమ్మ నాన్న గారు పెద్ద భూస్వామి. దాదాపు నూరు ఎకరాలు భూములు ఉండేవి . ఇల్లంతా సందడిగా ఉండేది. ఎక్కడ చూసినా పాడి పంటలే వాళ్ళ ఇంట్లో .

రెడ్డమ్మ ఐఏఎస్ చదివి కలెక్టర్ గావాలని ఉవ్విళ్లూరేది. నేను గూడా చాలా ఎంకరేజ్ చేసే వాడ్ని. దానికి తగ్గట్లే అన్ని విషయాల్లోనూ చాలా చురుగ్గా ఉండేది . మార్కుల్లో క్లాసులో ఫస్ట్ వచ్చేది .

ఒక రోజు రెడ్డమ్మ నా దగ్గరికి వచ్చింది.

ఆమె ముఖంలో ఏదో టెన్షన్ ప్రస్ఫుట మవుతోంది .

"బావా ...."నన్ను చూడ గానే ఏడ్చేసింది .

"ఏమయింది "అన్నాను నేను .

నాన్న నాకు పెళ్లి సంబంధం ఖాయం చేశారు . నేను పెళ్లి చేసుకోను అంటే గూడా ఒప్పు కోలేదు . అధికార పార్టీ ఎం ఎల్ ఏ గారి చెల్లెలి కొడుకంట.. నాకేమో బి ఏ తరువాత ఐఏఎస్ చేయాలని ఉంది .

ఇటీవల మా మామయ్య విల్లెజ్ సర్పంచ్ అయిన కాడ్నుంచి ఆయన తీరే మారి పోయింది . ఆయన మాటల్లో దర్పం పెరిగింది . నాకు చాలా బాధ వేసింది. ఇద్దరం సెటిల్ ఆయిన్ తర్వాత నేనే రెడ్డమ్మ ను పెళ్లి చేసు కోవాలను కొన్నా . గ్రాడ్యు యేషన్ ఆయిన తర్వాత నేను సి ఏ లోనూ , తాను ఐఏఎస్ చేయాలని అను కొన్నాము .

"మరి నేను మాట్లాడనా ? "

"మాట్లాడు "

సరే నని , మొబైల్ తీసు కొని వాళ్ళ నాన్నతో మాట్లాడాను. నాకు కళ్ళు తిరిగి బైర్లు కమ్మి నట్లయింది ఆయన మాటలు విన్నాక ."ఒరేయ్ రామ్ నారాయణ .. రెడ్డమ్మ ను నీ కెపుడు ఇస్తామని అనుకోలేదు. అసలు నువ్వెంత .. నీ స్థాయి ఎంత .. పోనీ నీ కాడ అన్ని ఆస్తులు ,అంతస్తులు ఉన్నాయా .. నువ్వు రేపో మాపో ఏదో క్లర్క్ అయిన తరువాత నీ చేతుల్లో పెడితే మా అమ్మి సుఖ పడుతుందా . రెడ్డమ్మ సంగతి మరచిపో .. లేదంటే మీ అమ్మ నాన్న కు మూడు తుంది నా దగ్గర .." అన్నాడు ఆయన కటువు గానే. అయన గర్వాన్ని , ఆ మాటల్లో ఉన్న హేళన విన్న రెడ్డమ్మ కన్నీరు మున్నీరుగ ఏడ్చింది .

"ఇప్పుడెట్లా బావ .. నాన్న కర్క కఠోరకుడు .. ఆయన ఒకడు చెప్పింది వినడు గదా. .?"

"ఇంట్లో వాళ్లకు చెప్పకుండా పెళ్లి చేసు కొందామా బావా ? ఎక్కడి కయినా పారి పోదామా ? నేను నిన్ను తప్ప ఇంకొకరిని పెళ్లి చేసుకోను బావా !" అని నా చేతుల్ని పట్టుకొని చిన్న పిల్ల లా ఏడ్చింది .

నా కంత ధైర్యం లేదు . పారి పోయి పెళ్లి చేసుకొంటే మా శవాలను చూసే దాకా మా మామ నిద్ర పోడు . ఆయన సంగతి నాకు తెలుసు . రెడ్డమ్మ కు ధైర్యం చెప్పినాను. జరిగేది జరగక మానదు అని చెప్పాను .

రెడ్డమ్మకు ఇష్టం లేక పోయినా , ఆమె ఆ ఎమ్మెల్యే సంబంధం కట్ట బెట్టాడు వాళ్ళ నాన్న. అలా రెడ్డమ్మ కన్న కలల్ని వాళ్ళ నాన్న మంకు తనం వాళ్ళ కల్లలయి పొయ్యాయి.

మా మామయ్య చని పోయిన తర్వాత రెడ్డమ్మ సంసారం బాగానే గడిచింది కొన్ని రోజులు . గానీ మోహన్ పేకాట , హార్స్ రేస్ లలో చాలా డబ్బు పోగొట్టు కొన్నాడని రెడ్డమ్మ చెప్పింది. ఆస్తులన్నీ కరిగి పొయ్యాక, ఉన్న పొలాల్లో అంత ఫలసాయం రాక పోవడం వల్ల , ఏదో కాంట్రాక్టర్ దగ్గర చిన్న ఉద్యోగం వెలగ బెడుతున్నాడు మోహన్ తిరుపతిలో .

నేను మా మామయ్య చేసిన అవమానంతో కసిగా చదివి బికామ్ తర్వాత సి ఏ లో చేరి అన్ని ఫస్ట్ అట్టెంప్ట్ లో పాస్ అయి , అకౌంటెంట్ గా ప్రాక్టీస్ చేస్తున్నాను . నేను ఆర్థికంగా బాగా సంపాయిస్తు బాగా సెటిల్ అయ్యాను హైదరాబాద్ లో .

మోహన్ వచ్చాక ఇద్దరం లంచ్ చేసాము. నా కళ్ళలో కళ్ళు పెట్టి చూడ లేక పోతున్నాడు మోహన్ . ఏదో అన్యాయం చేసినట్లుగా ఫీల్ అయి పోతున్నాడు .

"మోహన్ .. అంతా ఓకే గదా. ."

"అసలేం బాగా లేదు రామ్ . తెలిసి తెలిసి జీవితాన్ని నాశనం చేసుకొన్నాను . అంతే గాకుండా రెడ్డమ్మ జీవితాన్ని నాశనం చేసాను. ఆడ పిల్లల జీవితాలతో ఆడు కోగూడదు రామ్ " అన్నాడు మోహన్ .

"నువ్వేం తప్పు చెయ్యలేదు .. అది వాళ్ళ నాన్న చేసిన తప్పు. " అన్నాను నేను .

"అవును రామ్ . అడ పిల్ల తల్లి తండ్రులు పెళ్లి పెళ్లి అని వాళ్ళ జీవితాల్ని నాశనం చెయ్య గూడదు . వాళ్ళను బాగా చదివించి , వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడే వరకు పెళ్లి ప్రస్తావన తేగూడదు . ఈ పితృ స్వామ్య వ్యవస్థలో ఆడపిల్ల ల జీవితాల్ని మనం నాశనం చేస్తున్నాము . లక్షణంగా చదివి ఐఏఎస్ కావలసిన రెడ్డమ్మను ఇలా చేసాను. "అన్నాడు మోహన్ .

"అవును. నా ఇద్దరు ఆడ పిల్లల్ని నేను అలాగే పెంచుతాను. వాళ్ళను బాగా చదివించి వాళ్లు ఆర్థికంగా నిలబడిన తరువాతే పెళ్లి. అది గూడా వాళ్లకు నచ్చిన పిల్లవాడికే ఇచ్చి పెళ్లి చేస్తాను. " అన్నాడు మోహన్ మళ్ళీ .

"అవును .. మోహన్ మనం తప్పని సరిగా మారాలి. మన పెద్ద వాళ్ళు చేసిన తప్పులే మనం చెయ్యగూడదు . ఆడపిల్లల జీవితాలను తల్లి తండ్రులుగా మనమే నాశనం చెయ్య కూడదు.మన తరంలో ఆయినా ఆడ పిల్లలు , మగ పిల్లలు అనే తేడా లేకుండా వాళ్ళని పెద్ద పెద్ద చదువులు చదివించాలి. వాళ్ళ ఆశల్ని , ఆశయాల్ని తెలుసు కొని దానికి తగ్గట్లుగా తల్లి తండ్రులు బాధ్యతగా ప్రవర్తించాలి. ఆడ పిల్లలు సంఘంలో తలెత్తుకు తిరిగేలా వాళ్ళను తీర్చి దిద్దాలి." అన్నాను నేను మోహన్ భుజం తడుతూ . బరువైన హృదయంతో లేచి బయలు దేరాను.




గంట రాత్రి ఎనిమిదిన్నర.

రాఘవయ్య భోంచేసి చెయ్యి కడుక్కొని తుండు గుడ్డతో తుడుచుకొంటూ హాల్లోకి వచ్చాడు.హాల్లో భారతమ్మ ఏదో పోగొట్టుకున్న దానిలా 'తనువిక్కడ-మనసెక్కడో ‘నన్న చందాన టివీ చూస్తోంది. అది గమనించిన రాఘవయ్యకు ఆమెపై జాలి కలిగి దగ్గరగా వెళ్ళి భుజం మీద చేయి వేసి “ఏమిటి...భోంచేయవా?"అని అడిగాడు.

పార్వతమ్మ ఉలిక్కి పడ్డట్టు తిరిగి భర్త ముఖంలోకి చూస్తూ "ఆకలిగా లేదండి. ఈ రోజు పాప ఫోన్ చేస్తానంది.ఎదురు చూస్తున్నాను “అంది టెన్షన్ ఫీలవుతూ.

"పిచ్చిదానా! నువ్వు భోంచేయడానికి-పాప వద్దనుంచి ఫోన్ రావడానికి సంబంధమేవిటి?యూ.ఎస్.ఏ లో వాళ్ళకిప్పుడు బహుశా ఉదయం పది గంటలుంటుంది.పైగా వాళ్ళకు ఈ రోజు ఆదివారం. పాప ఇంకా నిద్ర పోతుందేమోలే పాపం. నువ్వెళ్ళి భోంచేయ్ ! ఫోన్ వస్తే నేను పిలుస్తాను” అని రెట్ట పట్టుకొని లేపి డైనింగులోకి పంపి సోఫాలో కూర్చొని టివీలో తనకు ఇష్టమైన చానల్ను మార్చుకొని చూస్తున్నాడు రాఘవయ్య.

రాఘవయ్య, పార్వతమ్మ దంపతులకు గీత ఒక్కగానొక్క కూతురు.చాలా తెలివికలది. ఆమెకు ఇంటర్ మీడియట్ లో జిల్లా స్థాయిలో ఫస్టు ర్యాంకు వొచ్చింది.అందుకే ఓ కార్పొరేటు ఇంజనీరింగు కళాశాల యాజమాన్యంవారు ఆమెను పిలిచి పైసా ఫీజు లేకుండా ఫ్రీ సీటు ఇవ్వడమే కాక ప్రభుత్వపు స్కాలర్షిప్పు కూడా ఏర్పాటు చేసింది. అందుకు తగ్గట్టు నాలుగేళ్ళు కష్టపడి చదివి ఇంజనీరింగ్ డిగ్రీ డిస్టింక్షన్ లో పాసైంది. ఇంటి ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు అంతటితో ఆపుకొని ఏదేని వుద్యోగానికి వెళ్ళమని తల్లిదండ్రులు,బంధుమిత్రులు చెప్పినా వినకుండా తన ఆశయం మేరా అమెరికాలో ఎం.ఎస్ చదవాలని అందుకు కావలసిన జి.ఆర్ .ఇ పరీక్ష రాసి అక్కడ పేరున్న యూనివెర్సిటీలో సీటు సంపాయించుకొని అమెరికాకు వెళ్ళి పోయింది గీత.

ఆమె అమెరికా వెళ్ళి దాదాపు రెండేళ్ళు కావొస్తోంది. తన కోర్సు కూడా ఇంకో వారంలో పూర్తవుతోంది..అది పూర్తవుతూనే వెంటనే ఇండియాకు రానుంది గీత .ఆ విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్ చేస్తానంది. ఆ శుభ వార్తను వినాలనే తల్లదండ్రులు తాపత్రయపడుతూ ఎంతో ఆశతో, ఆదుర్దాతో కూతురి ఫోన్ కొరకు యెదురు చూస్తున్నారు. ముఖ్యంగా తల్లి పార్వతమ్మ.

రాఘవయ్య ఓ చిన్న కంపెనీలో గుమాస్తా. అందులో తనకొచ్చిన జీతం రాళ్ళతో, భార్య సహకారంతో సంసారాన్ని సాగించి కూతుర్ని ఇండియాలో ఇంజనీరింగ్ చదివించి ఎం. ఎస్ చదివే నిమిత్తం ఆమెను అమెరికాకు పంపించారు. కూతుర్ని అమెరికాకు పంపించటానికి ఆ తల్లిదండ్రులు పడ్డ కష్టం 'అబ్బా' వర్ణనాతీతం.అందుకే తల్లి దండ్రులకు కృతజ్ఞతగా వుంటూ తను సంపాయించి వాళ్ళను పోషించే రోజుకోసం ఎదురు చూస్తోంది గీత. ఆ రోజులు దగ్గరలోనే వున్నాయని నిముష నిముషానికి మనసులో తలచుకొంటూ ఆనందిస్తోందామె!

గీత అమెరికాలో వుండి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ఎం.ఎస్ . పట్టాతో మాతృ భూమిలో కాలు పెట్టాలన్న పట్టుదలతో చదువుతోంది. పాపం... ఆమెకు ఆర్థిక ఇబ్బందులు అక్కడ కూడా ఎదురవగా వాటిని అధిగమించే నిమిత్తం కాలేజి అయిన తరువాత తీరిక సమయాల్లో ఏవో చిన్నచిన్న పనులు చేసుకొని చదువుతూ తల్లిదండ్రులకు ఆ భారం లేకుండా చేసింది. తన సంపాదనలోనే అక్కడ నిలద్రొక్కుకుంది.రెండేళ్ళు చదివి ఎం.ఎస్. పూర్తి చేసుకొంది.త్వరలో ఇండియాకు రానున్నట్టు గత వారంలో తల్లికి ఫోన్ చేసి చెప్పింది.

ఫోన్ రింగైయ్యింది...

ఫోన్ అందుకున్నాడు రాఘవయ్య. బొంచేయడం ఆపి చేయి కడిగేసుకొని పరిగెత్తినట్టు భర్తవద్దకొచ్చింది పార్వతమ్మ అది కూతురి వద్ద నుంచి వచ్చిన ఫోనేనని వూహించుకొని.

"హల్లో! చెప్పమ్మా! బాగున్నావా...చాలా సంతోషం తల్లీ! ఏమిటి...ఫోన్ను అమ్మకిమ్మంటావా!అమ్మ కూడా నీ ఫోన్ కొరకే యెదురు చూస్తోందిరా తల్లీ! ఇదిగో అమ్మకిస్తున్నాను"అని ఫోన్ భార్య చేతికిచ్చి వెళ్ళి సోఫాలో కూర్చొని టివి చూస్తున్నాడు

రాఘవయ్య.

"ఇదిగో...మిమ్మల్నే ! ఆ టివి వాల్యూం కాస్త తగ్గించండి. ఆఁ ...చెప్పమ్మా...చెప్పురా తల్లీ! ఎలా వున్నావ్ ?" సంతోషంతో వుక్కిరి బిక్కిరై పోతూ అడిగింది తల్లి పార్వతమ్మ.

"ఐయామ్ ఫైన్ మా! ముఖ్యంగా మీకో శుభ వార్త. నా చదువు పూర్తయ్యింది.రాబోయే శనివారమే ఇండియాకు బయలుదేరుతున్నాను" సంతోషంతో చెప్పింది గీత.

"మై గాడ్ !ఎంతటి తియ్యటి కబురు చెప్పావే తల్లీ! నాకెంతో ఆనందంగా వుంది. నిజం చెప్పాలంటే నువ్వు అక్కడున్న ఈ రెండేళ్ళు ప్రతి నిముషం నిన్ను తలచుకొంటూ నేనూ మీ నాన్న భయంతోనే బ్రతికామమ్మా!"గద్గద స్వరంతో అంది. మళ్ళీ తనే "తల్లీ! ఈ రెండేళ్ళకే నిత్యం నా కళ్ళలో కదిలాడే నీ రూపాన్ని లీలగా మరచి పోతున్నానేమోనని పిస్తోంది. ఇప్పుడు నువ్వు ఆ వూరి తిండికి, వాతావరణానికి బాగా రంగొచ్చి అందంగా తయారై వుంటావనుకొంటున్నాను !" ఆదుర్దాతో అంది తల్లి పార్వతమ్మ. గీత పకపక నవ్వింది.

"నువ్విక్కపై అలా ఏదేదో వూహించుకొని భయపడవలసిన అవసరం లేదమ్మా. నేను వచ్చేస్తున్నానుగా!ఆదివారం రాత్రికల్లా...నా దేశంలో...నా మాతృభూమిలో...నా ఇంట్లో...నా తల్లి ఒడిలో వుంటాను...ఓకే! ఇప్పుడు నీకు నాన్నకు షుగర్ , బిపిలకు కావలసిన మందులు,హెల్త్ పరమైన డ్రిక్సును కొనటానికి షాపింగ్ వెళుతున్నాను. తతిమ్మా విషయాలు ముఖాముఖి.బై!"ఫోన్ కట్ చేసి వెళ్ళి కారులో కూర్చొంది గీత స్నేహితురాలు కారును నడుపుతోంది. కారు వేగాన్ని పుంజుకొంది ఇరవై మైళ్ళకావల వున్న హెచ్ .ఇ. బి.షాపింగ్ సెంటర్కు.

భర్తకు విషయాలు చెప్పింది పార్వతమ్మ. భార్య భర్తలిద్దరూ కూతురు ఇండియాకు వస్తుందన్న ఆనందంలో ఆ సంతోషాన్ని పంచుకొన్నారు. అలాగే టివీని చూస్తూ వున్నారు.

అర్థగంట తరువాత....

అమెరికాలో చదువు పూర్తి చేసుకొని మరో రెండు రోజుల్లో మాతృభూమి ఇండియాకు బయలుదేరనున్న గీత, ఎం ఎస్ విద్యార్థిని కారు ప్రమాదంలో ప్రాణాల్ని కోల్పోయింది. ప్రమాదానికి కారణం అతి వేగమే! ఇప్పుడు హ్యూస్టన్ సిటీలోని తెలుగు సంఘం వారు స్వచ్ఛందంగా వివరాలను సేకరించి ఆమె మృత దేహాన్ని మాతృదేశం ఇండియాకు పంపటానికి తగు చర్యలు

తీసుకొంటున్నారు.

అంతే....

టివిలో వేస్తున్న స్కోలింగ్ వార్తలను చదివిన గీత తల్లిదండ్రులు షాక్కు గురై, వేదనకు లోనై,      అదః పాతాళానికి కృంగిపోయి, దుఃఖ సముద్రంలో మునిగి పోయారు,




బైక్      సర్వీసింగ్ కి ఇవ్వడంతో, ఆటోలో ఇంటికి బయలుదేరాడు శంతన్.ఇంటికెళ్తున్నాడనే మాటేగానీ అతని మనసంతా కూరగాయల సంతలా చాలా హడావుడిగా ఉంది.చేతులు నలుపుకుంటూ,మా మావగారు మా ఇంటికి వచ్చేసుంటారా?లలిత ఆయనతో పాటు పుట్టింటికి వెళ్లిపోయుంటుందా.?దేవుడా నువ్వే దిక్కు, అని అనుకుంటుండగానే, ఇల్లు వచ్చేసింది.అ, ఆ .ఇక్కడే ఆపు.అంటూ ఆటో దిగి,ఆటో అతనికి డబ్బులిచ్చి ,ఇంట్లోకి నడిచాడు.అనుకున్న విధంగానే అనుకున్నదంతా అయింది.అప్పటికే అతని మావగారు,దివాని కాట్ పై యాంగ్రీ క్యాట్లా కూర్చుని ఉన్నాడు.లలిత కూడా అతని పక్కనే ఇంకా కోపంగా కూర్చుని ఉంది.తినేసేలా ఒక చూపు చూసి తల తిప్పేసింది.ఆమె పక్కనే బట్టలు సర్దేసిన ట్రావెల్స్ బ్యాగ్ కూడా ఉంది.శంతన్, ఓ గుటక మింగి ఎప్పుడొచ్చారు మావయ్యా.అంతా కులాసానా,అడిగాడు పలకరింపుగా.

ఏం కులాసా,అంతా లాసే అల్లుడూ నా వ్యాపారంలో.ఇంతకీ నేను వచ్చిన విషయమేంటంటే ,మా అమ్మాయి నాకు ఫోన్ చేసి అర్జెంట్ గా వచ్చి తనని నాతో పాటు మా ఇంటికి తీసుకెళ్లమంది.నీతో వేగలేను,ఉడకలేను అంటోంది.ఇక నీకు వండిపెట్టడం,నీతో ఉండిపెట్టడం తన వల్ల కాదంటోంది.నీతో తెగదెంపులు కావాలంటోంది.కానీ మీ మధ్య ఈ రణానికి కారణం మాత్రం చెప్పలేదు. అల్లుడు తిడుతున్నాడా అంటే లేదంది.కొడుతున్నాడా అంటే కాదంది.పోనీ వ్యసనాలేమైనా అంటే లేవంది.మరి ఎంటమ్మా అంటే చెప్పదూ. అంటూ దీర్ఘం తీస్తూ లలిత వంక చూశారు మూర్తిగారు.

అబ్బా,నాన్నా అలా చూడకు. అలాంటివేం కాదు.పైగా ఆయన నన్ను బాగానే చూసుకుంటున్నారు.కాకపోతే ఆయనికి శకునాల పిచ్చి.ఆ పిచ్చితోనే ఆయన నాకు పిచ్చి కోపం తెప్పిస్తున్నారు.అందుకే ఇక ఆయన శకునాల పైత్యం భరించడం నా వల్ల కాదు.ఆఖరికి, ఆయన్ని ఎవరో షార్ట్ గా శకుని అని పిలిచినపుడు, ఆయనకి బెస్ట్ ఎంప్లాయ్ అవార్డ్ వచ్చిందని, ఆయన పేరు శంతన్ కుమార్ నివాస్ ని శకునిగా షార్ట్ చేసుకున్నారు. చెప్పిందామె,అసహనంగా.

అది విన్న మూర్తి గారు, తేలిగ్గా ఓ నవ్వు నవ్వి, ఓర్నీ,దీనికామ్మా నువ్వు ఇంతలా ఇదైపోయింది.ఇంకా నేను అనవసరంగా ఆతృత పడ్డాను.చెప్పాడాయన నిదానపడుతూ.

అదేంటి నాన్నా ! నేను ఇంత భారంగా చెప్తుంటే ,నువ్వు అంత తేలికగా తీసేస్తావ్.అయినా వింటే ఏం తెలుస్తుంది,కంటే కదా పురిటి నొప్పి తెలిసేదీ అని.నీకు చెప్పి వృధా చెప్పిందామె,ఉక్రోషంగా.

అంతేలేమ్మా.భూదేవంత ఓర్పు ,బూందీ అంత మెత్తని మనసు ఉన్న నీ సహనాన్నే పరీక్షించిన ఆ శకునాల సంగతేంటో నాకూ చెప్పమ్మా.అసలు,తప్పు నీదో ,అల్లుడితో ఇట్టే తేల్చేస్తాను.చెప్పాడాయన నిక్కచ్చిగా.

అయితే నేను చక,చకా చెప్తాను.నువ్వు టక,టకా విన్నాన్నా.ఓ నెల్రోజుల క్రితం,ఏవండీ చిట్టీ పాడండి.నాలుగు రూపాయల వడ్డీ అప్పు తీర్చేద్దాం.అనవసరంగా నెలకి ఊరికే బోలెడు వడ్డీ పోతోందని నేను అనగానే,ఆయన దెబ్యపు మొహంతో ,సందేహంగా శూన్యంలోకి చూస్తూ,ఇప్పుడు చిట్ పాడాలంటావా,అవసరమా అని అంటుండగానే ఆయన ఎడమ కన్ను టప,టపా,టప ,టపా అదిరిందట.దాంతో అపశకునం,అపశకునం ఇప్పుడు పాడకూడదు.ఎడం కన్ను అదిరింది.అని గుడ్డిగా ఆ శకునం నమ్మి ,మడ్డిగా ,ఎడ్డిగా ఇంకా వడ్డీనే కడుతున్నారు.సరేలే.అని సరిపెట్టుకున్నాను.మరో రోజు కాకి ఇంటి ముందు అరిచిందని,కనుక చుట్టాలు చుట్టలుగా వచ్చి పడతారనీ ,అలా వస్తే తొందరగా పోరనే శకునం నమ్మి ఇంటి బయట తాళం పెట్టి ,వెనుక వైపు నుండి ఇంట్లోకి వచ్చారు.దరిద్రం ఏంటంటే ,ఆ రోజు నిజంగానే దూరపు చుట్టాలు వచ్చి ,తాళం చూసి వెనుదిరిగారు.దాంతో ఈయన గుడ్డి శకునాల నమ్మకం అడ్డూ అదుపూ లేకుండా ఇంకా బలపడింది.చెప్పిందామె,భారంగా.

అవునా.పెద్ద ఆశ్చర్యం ప్రకటించారు మూర్తిగారు.

అవున్నాన్నా.ఇదే కాక,మొన్నామధ్య దూరపు చుట్టరికం గల శాంతమ్మ పిన్నివాళ్ళమ్మాయి ఇక్కడికి ఓ ముఖ్యమైన ఇంటర్వ్యూ కోసం వచ్చింది.ఈయనే రైల్వే స్టేషన్ కి వెళ్ళి తీసుకొచ్చారు.నేను ఉన్న దాన్ని ఉండకుండా ఆటోలో ఎందుకూ?బావగారు నిన్ను ఇంటర్వ్యూ జరిగే చోట భద్రంగా దించుతారు అన్నాను.ఈయన కూడా అలాగే అన్నారు.తర్వాత కరెక్ట్ గా వీళ్ళు బయలుదేరే సమయానికి, ఓ నల్ల పిల్లి గుమ్మానికి ఎదురుగా వచ్చి కూర్చుంది.అంతే ,గుమ్మం దాటి వెళ్లబోతూ,ఏదో పెద్ద పులిని చూసినట్టు, వామ్మో అని పెద్ద రాకాసి కేకేసి ఓ గెంతు గెంతి ,వెనక్కి వచ్చేశారు.అపశకునం ,ఆ పిల్లి అక్కడినుండి వెళితే కానీ బయటకి అడుగు పెట్టనని ఇంట్లోకొచ్చేశారు.దాంతో నేనూ, ఆ అమ్మాయి ఎంత చెప్పినా, ఏం చెప్పినా వినలేదు.దాంతో ఆమె కోపగించుకొని ,రుస,రుసలాడిపోతూ ఆటో ఎక్కి ఇంటర్వ్యూకి వెళ్లిపోయింది.అయితే ఇంతకు మునుపు ,ఆ పిల్లి నేను ఎంత బెదిరించినా ,కొంచెం కూడా కదలక పోవడానికి కారణం ,దాని కాలుపై ఏదో దెబ్బతగిలింది మరి.అందుకే కదల్లేదు.చెప్పిందామె నీరసంగా.

అయ్యో!అలాగా?ఇంతకీ ఆ అమ్మాయి ఇంటర్వ్యూకి టైమ్ కి వెళ్ళిందామ్మా.అడిగారు మూర్తిగారు ఆశక్తిగా.

ఆ.ఆ.వెళ్లింది నాన్నా.కానీ ఇంటర్వ్యూకి మాత్రమే కాదు.అట్నుండి అటు అలాగే చెప్పా పెట్టకుండా వాళ్ళ ఊరు వెళ్లిపోయింది.తర్వాత నేను , ఓ భంధువుల పెళ్ళిలో ఆమెని చూసి, పలకరించాలని ఎంత ప్రయత్నించినా,కనీసం ఆమె నా వంక చూడను కూడా చూడలేదు.నాకు ఎంతో అవమానం అనిపించిందంటే నమ్ము.అది నాన్నా ఈయన ఘనకార్యం.చిట పటలాడిపోయింది.

నువ్వు చెప్తుంటే అర్థమయిందమ్మా.అల్లుడి పైత్యం ఎంతగా ముదిరిందో.అయినా ఇలాంటివి చూసి ,చూడనట్టుంటే సరిపోయేదిగామ్మా. మధ్యలో నువ్వు ఎందుకు నీ కాపురం నాశనం చేసుకోవడం.నచ్చ చెప్పే ప్రయత్నం చేశాడాయన.అప్పటి నుండి ఇప్పటివరకు అలాగే అనుకుంటూ వచ్చాన్నాన్నా ,కానీ ఆయన ఈ మధ్య మరీ అన్యాయమైపోతున్నారు.ఓ పక్షం రోజుల క్రితం,ఆయన ఆఫీసుకు వెళ్తుంటే,ఏదో శవం(ఊరేగింపు) ఎదొరొచ్చిందట.తర్వాత ఆయన ఆఫీసుకు వెళ్ళగానే ప్రమోషన్ రాబోతోందని చెప్పారట.దాంతో ఆయనకి ఆ శకునంపై బాగా గురి కుదిరి,ఇప్పుడు ఈ ఇల్లు ఏకంగా శ్మశానానికి దగ్గరగా తీసుకున్నారు.ఖర్మ.రోజూ డప్పు మోతలూ,ఏడుపులూ,పెడబొబ్బలూ వినలేక చస్తున్నానంటే నమ్ము నాన్నా.చెప్పిందామె,భయంగా గుటకలు మింగుతూ,తండ్రికి కొంచెం దగ్గరగా జరిగి కూర్చుని, ఇంకా వింటే ముక్కున వేలేసుకుంటావ్ .

ఆ తర్వాత, శవం ఎదురు రాని రోజు ఆఫీసుకు వెళ్ళేవారు కాదు.పోయిన వారం ఓ రోజు, బైక్ సడన్ గా ఆగి పోయిందట. దానికి

కారణం,అంతకు ముందు ఆయన చూసుకోకుండా కాలితో తొక్కిన దిష్టి నిమ్మకాయ మూలంగానే అని నమ్మి, శాంతి పూజలు అని అయుదు వేలు తగలేశారు.అని లలిత చిత్రంగా తండ్రికి చెప్తుండగానే శంతన్ అడ్డుపడి, -అబ్బా లలితా.నువ్వు చెప్పింది అక్షరాలా నిజమే.ఈ శకునాలూ అవీ ,ఇవీ అంతా ఉత్తిదేనని నేనూ ఈ మధ్యే తెలుసుకున్నాను.మదర్ ప్రామిస్సు.అంటూ తలపై చేయి పెట్టుకున్నాడు.

అతని వంక కాసింత అనుమానంగా చూస్తూ,నేను నమ్మను.చందమామ నల్లగా,బొగ్గు తెల్లగా మారుతుందంటే నమ్ముతానేమోగానీ,మీరు శకునాలు నమ్మడం మానేశారని, మసి పూసి మారేడుకాయ మాటలు చెప్తే మాత్రం నేను నమ్మను.భహుశా నేను పుట్టింటికి పోతే,మీ వంట పనికో ,ఇంటి పనికో ఇబ్బంది అవుతుందేమోనని,ఇలా శకునాలు నమ్మడం మానేశానని అబద్ధం చెబుతున్నారు.అంతేనా.అడిగిందామె.

నేను చెప్పేది నిజమే లలితా.అనుభవపూర్వకంగా తెలిసింది.కానీ నీతో చెప్పలేదు. రోజుకి ఒకటికి రెండు శవాలు ఎదురు చూసుకుని మరీ ఆఫీసుకు ఆలస్యంగా వెళ్తుండడంతో,వచ్చే ప్రమోషన్ ఆగిపోయింది.ఇక నా ఎడమ కన్ను అదిరిందని ,నీ మాటలు పక్కన పెట్టి చిట్ పాడటం వాయిదా వేశాను.దాంతో నెల జీతం పెద్దగా మిగలట్లేదు.పోయిన నెల వడ్డీ కూడా కట్టలేకపోయాను.దానికి గాను వాడిలో నానా మాటలూ పడాల్సి వచ్చింది.అలాగే కాకి అరుపు విని ఎప్పటిలానే వీది తలుపుకి తాళం వేశాను.దాంతో నాకు వచ్చిన ఇంపోర్టెంట్ కొరిఎర్ మిస్ అయ్యాను.ఆ కారణంగా,అకారణంగా ఆఫీసు ఫారిన్ టూర్ ఛాన్స్ మిస్సయింది.కనుక ఇక నుండి ఆ శకునాల పిచ్చి నమ్మకానికి స్వస్తి చెప్పాను.నా బుద్ధి లోపం సరిచేసుకుంటాను.ఇది నిజం.నువ్వు నన్ను మనస్ఫూర్తిగా నమ్మాలనే,ఇప్పటివరకూ నీ దగ్గర దాచినవన్నీ నీకు వివరంగా చెప్పాను.ఫాదర్ ప్రామిస్సు.చెప్పాడు శంతన్ చాలా నిజాయితీ గల స్వరంతో.

దాంతో చాలా హ్యాపీగా ఫీల్ అయ్యింది లలిత. మూర్తి గారు కూడా సంతోషిస్తూ,బావుందల్లుడుగారూ,మూడత్వానికి పోయి,శకునాలు పాటిస్తే అదృష్టం వరిస్తుందని, పేరు మారిస్తేనో,ఊరు మారిస్తేనో ఏదో కలిసొస్తుందని,మన జీవితాల్లో ఏదో జరుగుతుందని గుడ్డిగా మూఢ విధానాలకి లోబడి సంసారాలు ,జీవితాలు గుల్ల చేసుకునేవారు, మీలాగే మార్పు తెచ్చుకుంటే ఎంత బావుంటుంది చెప్పండి.అన్నాడాయన మధు ,లలితల బుజాలపై చేతులేసి,సంతోషంగా వారిని దగ్గరకి తీసుకుంటూ.




విడాకుల కోసం కేసు వేసిన భార్యాభర్తలకు కౌన్సలింగు కి రిఫర్ చేసి తిరిగి రెండు వారాలకు వాయిదా రాసి తన ఛాంబరు లోకి వచ్చింది వనిత .

తర్వాత కేసుకు సంభందించిన కాయితాలు యెదురుగా టేబుల్ మీద వున్నాయి . కాళీ కప్పు టేబుల్ మీద పెట్టి కాయితాలు చేతిలోకి తీసుకుంది .

కేసు పూర్తి గా చదివేక తనకు కలిగిన సందేహాలని నెంబరు వారీగా రాసుకుంది .

" మేడమ్ కేసు రెడీ , హాజర్ చెప్పమంటారా ? " అన్న పిలుపుతో తలెత్తి సరే అన్నట్టుగా తలాడించి పేపర్లు అందించి అతని వెనుకే నాలుగో నంబరు రూము లోకి నడిచింది .

కేసు పది సంవత్సరాల ఆరతి కస్టడీ గురించి ఆమె తండ్రి కమల్ ఆరతి తనకే చెందాలని వేసిన కేసు , తల్లి కాంచన అందుకు అంగీకరించడం లేదు . న్యాయస్థానం తమకు పూర్తి న్యాయం చేస్తుందనే నమ్మకంతో కోర్టుని ఆశ్రయించేరు అని గుమస్తా స్థూలంగా కేసుని కోర్టుకి వినిపించేడు

వనిత ముగ్గురినీ పరీక్షగా చూసింది . మధ్యతరగతి కన్నా ఒక మెట్టు కిందన వున్న కుటుంబమని వారిని చూడగానే తెలుస్తోంది . వారిచ్చిన వివరాల ప్రకారం తండ్రి ఆరతిని కాంచన కిడ్నాప్ చేసి నిర్బంధించి నట్లు అభి యోగంలో వుంది . కాంచన పిల్ల యిష్టప్రకారమే తన దగ్గరకి వచ్చినట్లు చెప్తోంది .

వనిత కమల్ ని కాంచనని చూస్తూ యిద్దరికీ సమయం యివ్వబడుతుందని , వారు చెప్ప దలుచుకున్నది క్లుప్తంగా చెప్పుకోవచ్చని , యిద్దరి వాదనలూ విన్న తరువాత తీర్పు చెప్పబడుతుందని చెప్పి ముందుగా కమల్ ని చెప్ప మంది .

కమల్ చిన్న టైలరింగు పనులు చేసి జీవనం సాగిస్తున్న సామాన్యుడు . కాంచన కలలలో బతికే మనిషి , యిద్దరికీ యెక్కడా పొంతన కుదరలేదు . కొట్టుకుంటూ తిట్టుకుంటూ ఆరతికి తల్లి తండ్రులయేరు . పిల్ల రాక తో మరింత అసహనానికి గురైన కాంచన తన కలల పురుషుడిని యింటికి తెచ్చి తనకూ యింటికి యెటువంటి సంబంధం లేదని కుండబద్దలకొట్టినట్లు చెప్పి యేడుస్తున్న పసిపిల్లని వదలి వెళ్ళిపోయింది . నాలుగిళ్ళ అవతల వుంటున్న చెల్లెలి సహాయంతో పిల్లని పెంచుకుంటున్నాడు . తెలివైన పిల్ల నాలుగో తరగతి లోకి వచ్చింది . నెల్లాళ్ళ కిందట నాన్నా యెవరో నన్ను వెంబడిస్తున్నారు అంది . కిందటి గురువారం బడికి వెళ్ళిన పిల్ల యింటికి రాలేదు . పోలీసు స్టేషను లో ఫిర్యాదు చేసేడు . తనలాంటి వాడి పిల్లని డబ్బు కోసం కిడ్నాప్ చెయ్యరు . స్కూల్లో వాకబు చేస్తే గత కొన్ని రోజులుగా యెవరో ఆడమనిషి తో రోజూ ఆరతి మాట్లాడడం చూసినట్టుగా కొందరు పిల్లలు యిచ్చిన సమాచారంతో కాంచనే పిల్లని కిడ్నాప్ చేసివుండొచ్చు అనే అనుమానం తో పోలీసులు వెంటనే రంగం లోకి దిగి అదే వూరిలో మరో మూల వున్న కాంచనని పట్టుకోడం పెద్ద కష్టం కాలేదు . పోలీసులు కాంచన యింటిపై దాడి చేసేటప్పుడు ఆరతి మంచానికి కట్టి , నోటికి టేపు అంటించి స్పృహ లేని స్థితిలో లభించింది . కాంచన దగ్గర వుంటే ఆరతి బతుకు నాశనమవుతుందని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు కమల్ .

కాంచన కమల్ ఒక చేతకాని వాడని అతనిని వదిలి వెళ్లిన మాట నిజమేనని , పిల్లమీద మమకారం చంపుకోలేక యిన్నేళ్ళ తరవాత వచ్చేనని , వయసుకి వస్తున్న పిల్ల తండ్రి దగ్గర వుండడం మంచిది కాదని , ఆరతి అన్న పేరు తాను ముద్దుగా పెట్టుకున్నదని , కమల్ ఆరతి ముద్దూ ముచ్చటా తీర్చలేడని , పిల్ల నాన్న నాన్న అని బాగా మారాం చేస్తుంటే భయం చెప్పడానికి అలా చెయ్య వలసి వచ్చిందని , పిల్ల కోసం కమల్ విధించే యేషరతుకైనా తాను సిద్ధమేనని , అతను వొప్పుకుంటే అతనిలో కాపురం చెయ్యడానికైనా సిద్ధమేనని గోల గోల గా యేడుస్తూ స్పృహ తప్పి పడిపోయింది .

కమల్ కాంచన ప్రతిపాదనని యెంతమాత్రం ఆమోదించలేదు . ప్రేమ వున్నదయితే కట్టిపడెయ్యడం యేమిటి అంటాడు . మిగతావి యెలా వున్నా కట్టేయడం అన్న మాట వనిత కి కూడా మింగుడు పడడం లేదు .

ఇవాళ వాయిదా చెప్పేద్దాం అంటే మరో పదిరోజులవరకు కోర్టు ఖాళీ లేదు . పిల్లని అంతవరకు రిమాండు హోముకి పంపాలి . సాక్ష్యాలు తక్కువయిన కేసులకు తప్ప యిలాంటి కేసులు వెంటనే పరిష్కరించేస్తారు జడ్జీలు .

తీర్పు యిచ్చెద్దాం అంటే కాస్త తికమక గా వుంది . పిల్లని తల్లితో వుండాలని తీర్పు యిస్తే యిన్నాళ్ళు మరో పెళ్లి చేసుకోకుండా పిల్లతోడిదే లోకంగా బతుకుతున్న తండ్రికి అన్యాయం చేసినట్లౌతుంది , అలాగని తండ్రి వైపు తీర్పిస్తే వయసుకి వస్తున్న పిల్లకి తండ్రి దగ్గర రక్షణ కరువౌతుందేమో అనే సందేహం ముందుకు వెళ్లనివ్వటం లేదు . ఇంతకీ యీసమస్యకి కారణం దగ్గరే జవాబు దొరుకుతుందేమో ? గతం లో చాలా సార్లు పిల్లల సహకారంతోనే యెన్నో కేసులు ఛేదించిన సంఘటనలు లేక పోలేదు .

అందుకే యేకాంతంలో ఆరతితో మాట్లాడాలని నిర్ణయించు కొంది . పిల్ల బాగా బెదిరిపోయింది , యెవ్వరికీ భయపడక్కరలేదని యెన్నోసార్లు భరోసా యిచ్చేక ఆరతి వెక్కుతూ చెప్పసాగింది .

అమ్మ మీద వ్యాసం రాయలేదని స్కూల్లో నిలబెట్టించేరు అయిదేళ్ల ఆరతిని , 'అమ్మంటే అత్తా ' అని అడిగినందుకు నవ్వేరు తోటి పిల్లలు . ' నాన్నా అమ్మంటే ఎవరు , యెలా వుంటుంది ' అని నాన్న నడిగితే ' దెయ్యం , దెయ్యం లా వుంటుంది ' . అన్న సమాధానం .

" అది కాదు నాన్నా , కోమలి వాళ్ళమ్మ దానిని యెంతో ముద్దు చేస్తుందట , గోరు ముద్దలు తినిపిస్తుందట " అంటే " అవన్నీ నేను నీకు చేస్తున్నా కదరా ? , బుజ్జి " నాన్న సమాధానం .

" అత్తేమో పల్లవి ని రోజూ పాటపాడుతూ జోకొట్టి నిద్రపుచ్చు తుందట , మరి..... నాకూ.... "

" నేనూ రోజూ నీకు జోకొడుతున్నా కదా తల్లీ " నాన్న సమాధానం .

నువ్వయితే ఒక జడే యెప్పుడూ వేస్తున్నావు , అందరూ ఒంటి పిలక ఆరతి , ముసలి పిల్ల ఆరతి , అవ్వా ఆరతమ్మా బాగున్నావా ? అని వెక్కిరిస్తున్నారు నాన్నా , అమ్మంటే యించక్కా రెండుజడలు వేసును కదా ? "

" రేపు అత్తయ్య ని రెండు జడలు వెయ్యమంటానుగా "

అమ్మ కావాలని యింతలా చెప్పినా నాన్న అర్ధం చేసుకోడేమీ అనే వుక్రోషంతో కళ్లల్లో నీళ్ళు తిరిగేయి .

కాళ్ళు నేల కేసి గట్టిగా కొట్టి " నాకు అమ్మే కావాలి అమ్మేకావాలి మీరెవ్వరూ వద్దూ ......" గట్టిగా యేడ్వసాగింది .

నడ్డి మీద గట్టిగా పడ్డ దెబ్బకి యేడుపు వుదృతం యింకా పెంచింది .

నోర్మూయ్ " అంటూ ఒంటి నిండా దెబ్బలు పడసాగేయి .

పక్కింటి సూరీ వాళ్ళమ్మ అడ్డు పడ్డంతో దెబ్బలు ఆ రోజుకి తప్పేయి , కాని తండ్రి ఆ వుగ్రరూపం ఆరతి గుండెల్లో నిలిచి పోయింది . వయసు పెరుగు తున్న కొద్దీ తల్లి గురించి తెలుసు కోవాలని , తల్లి మీద మోజు పెరగ సాగేయి ఆరతి లో .

ఆ మోజులోనే తల్లిని గురించిన ప్రశ్నలు వేసి తన్నులు తినేది .

యెందుకో పాతమ్మ అంటే నాన్నకి కోపం , యిద్దరూ కటీఫ్ చెప్పుకొని వుంటారు , పోనీ కొత్తమ్మని తెచ్చుకుంటేనో ? ఆలోచనరావడం తడువు వరండాలో యెవరిదో డ్రెస్సు కుడుతున్న తండ్రి దగ్గరకి పరుగున వెళ్లి తన ఆలోచన చెప్పింది .

" ఆ వచ్చేది నీకు తల్లి అవదే "

" అవుతుంది నాన్నా , నేను అమ్మా అని పిలుస్తానుగా ? "

అంత చిన్న పిల్లలలో వుండే నిర్మలత్వం , వయసు , ఆలోచనా వున్న పెద్దలలో లోపించాయి యెందుకని ? , పెద్దా చిన్నా అందరూ అంత నిష్కల్మషంగా వుంటే ఈ ప్రపంచం యెంత అందంగా వుణ్ణో కదా ? .

"      విసిగించక వెళ్లవతలకి " అన్న నాన్న కళ్లల్లో కోపం ఆరతిని మాట్లాడనివ్వలేదు .

బయటికి చెప్పక పోయినా ఆరతి ఆలోచనలలో అమ్మంటే తనని యెంతో గారం చేసే మనిషి అన్నీ మంచి గుణాలున్న దేవత . యెవరూ లేనప్పుడు తల్లి యెదురుగా వున్నట్లు వూహించుకొని ఆమెతో సంభాషించడం చేసేది .

రెండు మూడు రోజులుగా మీ అమ్మని అని చెప్పి ఒకావిడ స్కూలు కి వచ్చి తనతో మాట్లాడడం , బడి దగ్గర అమ్మే ఉడికించిన శనక్కాయలు , జీళ్లు కొని యివ్వడం చేస్తోంది .

ఇంటికి వెడదాం రమ్మంటే రానంటోంది . అందరి తల్లుల్లా భోజనం సమయం లో గోరు ముద్దలు నోటికి అందించటం లేదు .

" అమ్మా అన్నం తినిపించవా అంటే " , నాకు అలవాటు లేదుగా ? , నువ్వే తినెయ్ " అనడం ఆరతికి నచ్చలే .

ఆ రోజు పుట్టిన రోజని అత్త తలస్నానం చేయించి నాన్న కుట్టిన కొత్త గౌను వేసింది . యెప్పటిలాగే లూజు లూజు గా వుంది గౌను . అమ్మ తనను చూడ్డానికి వచ్చిన రోజు తనని దగ్గరకు తీసుకొని 'నేనైతే నీకు మంచి రెడీమేడ్ గౌను తొడిగివుందును , యిలా ముసలమ్మలా కాకుండా అప్పుడు నువ్వు మహారాణి లా వుందువు " అన్న మాటలు చెవుల్లో తిరుగుతున్నాయి . ఇవాళ అమ్మ తప్పకుండా మంచి గౌను తెస్తుంది , అమ్మ నెలాగైనా వొప్పించి యింటికి తీసుకు వెళ్లాలి , ఆరతి ఆలోచనలన్నీ అమ్మ చుట్టూ తిరగసాగేయి .

పరాకుగా ' నాన్నా అమ్మ మనతో వుంటే యెంతో బాగుంటుంది కదా ' అన్న తరవాత నాన్నేమంటాడో అని భయపడింది .

కానీ చిత్రంగా నాన్న కసరలే కళ్లనిండా దిగులుతో " యేం నాన్నా యీ ముసలి నాన్న నీకు నచ్చలే " అంటూ గుండెకద్దుకున్నాడు      .                    ఆరతికి నాన్న గుండెల వెచ్చదనం నచ్చింది . ఆ వెచ్చదనం తల్లి దగ్గర దొరకలేదని అనిపించింది .

స్కూల్ కి బయలుదేరిన ఆరతికి టా టా చెప్పుతున్న నాన్న కళ్లల్లో నీటిపొరతో పాటు తన మీదవున్న యిష్టం కనిపించింది .

అమ్మ కళ్ళల్లో ఆ యిష్టం కనిపించలే , తను సరిగ్గా చూడలేదేమో ? ఇవాళ బాగా చూడాలి , నిన్నొచ్చిన ఆ గడ్డం అంకుల్ తనకి నచ్చలేదని , యింకెప్పుడూ అతనితో మాట్లాడొద్దని చెప్పాలి . ఆలోచనలతోనే స్కూలు దగ్గరకొచ్చింది .

ఎప్పుడూ నిలబడే చెట్టుకిందే నిలబడి వుంది అమ్మ .

" అమ్మా " అంటూ అమ్మ కి చుట్టుకు పోయింది .

గబుక్కున దూరంగా లాగి ' పదపద ' అంది అమ్మ .

" కొత్త బట్టలు కొనడానికా "

" కొత్త బట్టలా యెందుకు "

ఇవాళ నా పుట్టిన రోజుగా , రెడీమేడ్ వి కొనడానికి "

విసురుగా అమ్మ యేదో అనబోయే లోపలే ఆ గడ్డం అంకుల్ ' ఆ... ఆ.... అందుకే పద పద ' అంటూ అమ్మకి కళ్లతో సైగ చేసేడు .

అమ్మ కూడా " అవును పద పద " అంది .

ఇద్దరూ చెరో వైపు కూర్చొని ఆటోలో తీసుకు వెళ్లేరు .

" ఇటు యెక్కడకి వెళ్తున్నాం " అన్న ప్రశ్నకి ముందుగా యింటికి వెళ్లి అక్కడనుంచి బజారుకి వెళదాం అన్న సమాధానం వచ్చింది . " బజారు దగ్గరనుంచి నాన్న దగ్గరకి వెళదాం , నాన్నకి నీమీద కోపం వున్నా నేను చెపితే నిన్ను యేమనడులే " అంటూ మాట్లాడుతున్న ఆరతిని

" నోర్మయ్యమని చెప్పు తెగవాగుతోంది " గదమాయించేడు గడ్డపు అంకుల్ .

" ఇల్లుచేరేంత వరకేగా తరవాత యెలాగూ వాగలేదు " అంది అమ్మ .

ఆ మాటలకర్థం యిల్లుచేరేక తెలిసింది ఆరతికి .

" అమ్మా నీ యిల్లేమీ బాగాలేదు నాన్న దగ్గరకి వెళిపోదాం పద గౌను నాన్నతో వెళ్లి రేపు కనుక్కుందాం " ఆ యింట్లో అడుగు పెట్టిన దగ్గర నుంచి అమ్మ గడ్డం అంకుల్ తో కలిసి రాసుకు పూసుకు మాట్లాడటం నచ్చలేదు , ఆ యింట్లోంచి యెప్పుడు బయట పడతానా అనిపించ సాగింది ఆరతికి , అందుకే పదే పదే వెళ్లిపోదాం అనసాగింది .

" యెక్కడకీ వెళ్లేది , యేకంగా నువ్వు వెళ్లేది బొంబాయికే , నస పెట్టక నోర్మూసుకో " తీవ్రంగా అన్నాడు గడ్డం అంకుల్ .

బొంబాయి అన్న పదం చెవిన పడగానే భయం వేసింది ఆరతికి అందుకే తలుపు వైపు పరుగెత్తింది . ఆమె కన్నా ముందే రియాక్టయిన వాళ్లిద్దరూ ఆరతిని ఒడిసి పట్టుకొని కొట్టసాగేరు .

" అమ్మా .....అమ్మా ......కొట్టొద్దు ......కొట్టొద్దు.... నాన్న దగ్గరకి పంపెయ్ " గట్టిగా యేడ్వసాగింది సాగింది ఆరతి .

ఆరతి అరుపులు బయటకు వినిపించకుండా వుండేందుకు అమ్మ నోటికి గుడ్డ కట్టింది .

గడ్డం అంకుల్ చేతులు కాళ్లు మంచానికి కట్టేడు . అమ్మ కర్ర తెచ్చి బయటకి కనిపించని చోట్లలో కొట్టు , కనిపించే చోట కొడితే డబ్బులు తక్కువ వస్తాయి అంది . వీపు మీదా కాళ్ల మీదా చూడండి యెలా కొట్టారో ? ఈవిడ మా అమ్మ కాదేమో అని చాలా సార్లు అనిపించింది . నిజంగా మా అమ్మే అయితే మరి మా దోస్తులు చెప్పినట్లు ప్రేమగా , దయగా , నాన్న కొట్టవస్తే రక్షించే దేవతగా , నిద్దర పుచ్చేటప్పుడు చందమామంత చల్లగా లేదే . కాని మా దోస్తులు అమ్మ గురించి చెప్పినవన్నీ నాకు నాన్న దగ్గర దొరికేయి . ఎలా తెలిసిందో నాన్నకి , నేను అక్కడ బంధీగా వున్నట్లు , పోలీసులతో వచ్చి నన్ను ఈవిడ దగ్గర నుంచి రక్షించేడు . ఇలాంటి

అమ్మ నా కొద్దు మేడం , నన్ను నాన్న దగ్గర వుండనివ్వండి , మీకు దండం పెడతాను . ఇంత మంచినాన్న మీద వ్యాసం రాయమనకుండా అలాంటి అమ్మ మీద రాయమన్నారేంటి మా టీచర్ , యేం నాన్నల మీద వ్యాసాలు వుండవా ? "     అంటూ ముగించింది ఆరతి .

యెందుకో ఆరతి మాటలు వనిత లో ఆలోచనలు రేకెత్తించేయి . నిజమే యెవరూ అడగని ప్రశ్న . మమకారానికి ఆడా మగా తేడాలుంటాయా ? . అర్ధం లేని ఆలోచనలు చుట్టు ముట్టసాగేయి . గుమస్తా రాకతో కర్తవ్య నిర్వహణలో పడింది వనిత .

ఆరతి కష్టడీని కమల్ కు యిచ్చి , కాంచన , ఆమె సహచరుడి పైన క్రిమినల్ కేసుల నడిపించ వలసిందిగా పోలీసులను ఆజ్ఞాపిస్తూ తీర్పు యిచ్చింది వనిత .




అమ్మా! చిన్నమ్మా!' అంటూ నాంచారి పెట్టిన గావుకేకతో అప్పుడే బయటనుంచి వచ్చి     అలసటగా మంచంపై వాలినదాన్నల్లా ఉలిక్కిపడి లేచాను.

'ఏమైంది నాంచారమ్మా?'     అంటూ ఆ కేక వచ్చిన దిశగా పరిగెత్తాను.

వంటగది బయట నాంచారి భయంతో గజగజా వణుకుతూ గుడ్లప్పగించి లోపలికి చూస్తోంది.

'చిన్నమ్మా అదిగో ఆ లోపల అటు చూడండి !' అంటూ వేలెట్టి చూపించింది.

'ఏంటదీ?' అంటూ లోపలికి వెళ్ళి చూసిన నాకు ఒక పట్టాన నవ్వాగలేదు..................

అసలు కథేమిటంటే ..............

*********

నేను పుట్టింది పెరిగింది అంతా రాజమహేంద్రవరం దగ్గర ఉన్న తాపేశ్వరంలో. నాన్న అక్కడే వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోవడంవలన ఎప్పుడూ ఆ ఊరుదాటి ఎక్కడికి వెళ్ళవలసిన అవసరమే కలుగలేదు ఎవ్వరికీ .

మా ఇంట్లో పనికి నాంచారి అనే ఆవిడ ఉండేది. ఆవిడ అక్షర జ్ఞానం, ప్రపంచజ్ఞానం కూడా లేని అమాయకురాలు. ఆవిడకి నా అనేవారుఎవ్వరూ లేరనీ మా నాన్నమ్మ కాలంనుంచి మా ఇంట్లోనే ఉన్నదనీ అమ్మ చెప్పగా నాకు తెలిసింది.

65 సంవత్సరాల వయసులోనూ ఇంటి పనంతా ఎంతో ఉత్సాహంగా చేస్తుంది. చాలా కాలంనుంచి మా ఇంట్లో పనికి ఉండడం వలన ఆవిడ దాదపుగా మాఇంటి మనిషిలానే అయింది.

అమ్మా నాన్నలకు నేనొక్కదాన్నే సంతానం కావడం వలన ఇంట్లో అందరికీ నేనంటే విపరీతమైన గారం.

నా పేరు రాజ్యలక్ష్మి, నాన్నమ్మ పేరు. అందుకేనేమో నాంచారమ్మకి నాపట్ల మరింత వల్లమాలిన అభిమానం.

నాంచారి నన్నెప్పుడూ 'చిన్నమ్మా, మీరు!' అని మర్యాద పూర్వకంగా పిలిచేది .

'అదేమిటీ నన్ను అలా పిలుస్తావు ? చక్కగా నా పేరు పెట్టి పిలవరాదూ?' అని ఎన్నోసార్లు అడిగాను.

అందుకు నాంచారి ససేమిరా ఒప్పుకోలేదు సరికదా 'మీ నాన్నమ్మగోరు నన్ను అక్కలా సూసేవోరు. ఆ తల్లి నాకు యజమాని, మాకు అన్నదాత. మీలో నాకు ఆయమ్మ కనిపిస్తాది. మీ పేరు ఆయమ్మ పేరే కదా యజమానిని పేరు పెట్టి పిలవరాదమ్మా' అనేది.

నేను పై చదువులకి పట్నం వెళుతుంటే ' చిన్నమ్మా మళ్ళీ ఎప్పుడొస్తారు ఇంటికి?' అంటూ దిగులుపడింది నాంచారి.

చదువు పూర్తై ఈమధ్యనే గుంటూరులోని ఒక బ్యాంకులో ఆఫీసరుగా చేరాను. నాకు అన్ని సౌకర్యాలు ఉన్న పెద్ద ఇల్లు ఏర్పాటుచేసారు బ్యాంకువారు.

నాకు తోడుగా ఉంటుందని నాంచారిని నాతో రమ్మని అడిగాను. ఎప్పుడూ ఆ ఊరు దాటని నాంచారి మరోటప్పుడైతే ఏమనేదో తెలియదు కానీ నేనంటే ఉన్న వల్లమాలిన ప్రేమతో వెంటనే ఒప్పుకుంది.

రెండవ శనివారం బ్యాంకు సెలవు కావడంతో వెళ్ళి నాంచారిని నాతో గుంటూరు తీసుకొచ్చాను.

ఎప్పుడూ పల్లె దాటి ఎరుగని నాంచారి పట్నం చూసి సంబర పడింది. నా ఇల్లైతే మహా నచ్చేసింది నాంచారికి.

అలవాటు ప్రకారం వచ్చీ రాగానే ఇల్లంతా సర్దేసింది. నాంచారి ఉండడంతో ప్రస్తుతానికి నాకు ఇంట్లో పని కూడా పెద్దగా ఉండడం లేదు.

ఆరోజు ఆదివారం. అపార్ట్మెంట్ కాంప్లెక్సులో కూరలు అమ్మకానికి వస్తాయి ఉదయాన్నే. ముందరే వెళితే తాజా కూరలు దొరుకుతాయని చక చకా తయారై వాషింగ్ మెషిన్ లో బట్టలు వేసి, నాంచారికి చెప్పి తలుపు దగ్గరగా వేసి వెళ్ళాను.

కూరలు కొని ఇంటికి వచ్చి నాంచారికి అప్పగించి లోపలికి ఇలా వెళ్ళనో లేదో ..అలా నాంచారి కేక ....

********

తెరలు తెరలుగా నవ్వుతున్న నన్ను చూసి 'ఏంటి చిన్నమ్మగోరూ నాకిక్కడ భయంతో పై పాణాలు పైనే పోతా ఉంటే మీకు నవ్వుతాలగా ఉన్నాదా?' అంటూ నొచ్చుకుంది నాంచారి.

వెంటనే నవ్వాపి ' అయ్యో అది కాదు నాంచారమ్మా , అదీ బట్టలుతికే యంత్రం. వాషింగ్ మెషిన్ అంటారు'

'బట్టలుతకడానికి యంత్రమా? ఏం చోద్యమమ్మా?' అంది నా మాటలకి అద్భుతగులుతూ.

'అవును ఇప్పుడు అన్ని పనులకీ యంత్రాలు వచ్చేశాయిలే' అని 'ఆ యంత్రానికి క్రింద ఒక స్టాండు ఉండాలి. అది లేకే ఆ అదురుకి కదులుతోంది. అంతకంటే ఏం లేదులే . భయపడకు' అన్నాను.

స్టాండు లేకపోవడం వలన వాషింగ్ మెషిన్ స్పిన్ వేగానికి అదిరి ముందుకి కదిలివస్తోంది. అది నాకు అలవాటే కానీ నాంచారికి క్రొత్త కదా మరి!

స్టాండు కొనాలి అనుకుంటూనే అశ్రద్ధ చేసాను. ఇంతలో ఇదంతా జరిగింది.

ఆధునిక యంత్రాల జిమ్మిక్కులు తెలియని నాంచారమ్మ మెషిన్ కదలుతూ ముందుకు రావడం చూసి భయపడిపోయింది.

నేను వివరిస్తున్నంత సేపూ ఆశ్చర్యంతో కళ్ళు వెడల్పు చేసుకుని విని 'ఓసి దీని ఇల్లు బంగారంగానూ! ఇదన్నమాట

అసలు సంగతీ! మాలావు భయపెట్టేసినాది చిన్నమ్మ గారు ఈ బట్టలుతికే యంత్రం నన్ను?' అంటూ బుగ్గలు నొక్కుకుంది నాంచారి .




" ఎవరూ చూడట్లేదు కదా " అనుకుంటూ బెరుకు బెరుకుగా అటూ యిటూ రెండు మార్లు తల త్రిప్పి చూసి ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత శీను చేతిలో ఏదో కవర్ ని పెట్టేసి వడి వడిగా అక్కడినుండి వెళ్ళిపోయింది సీతాలు.

అయితే యిదంతా ఎవరి కళ్ళల్లో పడకూడదని ఆమె కోరుకుందో ఆ మనిషి కంట పడనే పడింది.

సీతాలు భర్త రాముడు ఆ ప్రక్క వీధిలో వున్న ప్యాసింజర్ ని ఆటోలో ఎక్కించుకుని రోడ్డెక్కుతూ ఈ వ్యవహారమంతా చూడనే చూసాడు. వెంటనే ఆటో దిగి " ఎవడే ఆడు " అంటూ భార్యని నిలదీయాలనిపించినా ఆటోలో ప్యాసింజర్ కూర్చుని వుండడం మూలాన కోపాన్ని ఆపుకున్నాడు.

***

రాముడూ సీతాలుది ప్రేమ వివాహం. వారిరువురి కుటుంబాలూ రాజమండ్రి దగ్గరే వున్న ఒక ఊరిలో ప్రక్క ప్రక్క యిళ్ళల్లో వుండేవి. మొదట్లో బాగానే కలిసి వున్నా ఆ తరువాత ఆ రెండిళ్ళ మధ్యన వున్న కాంపౌండ్ గోడ విషయంలోనూ, దానికి ఆనుకుని వుండే మునిసిపాలిటి వారి నీటి కుళాయి విషయంలోనూ వచ్చిన చిన్న చిన్న తగాదాలే చిలికి చిలికి గాలి వానలా మారడంతో రెండు కుటుంబాలు ఒకరికొకరు బద్ధ శత్రువులైపోయారు.

అయితే కుటుంబాల మధ్యన వున్న వైరానికి అతీతంగా సీతాలు, రాముడు మాత్రం ఒకరినొకరు బాగా యిష్టపడ్డారు. ఆ యిష్టమే మెల్లిగా ప్రేమలోకి దిగడంతో ఒకరిని చూడకుండా మరొకరు ఉండలేని స్థితికి వచ్చారు. వీరిద్దరి ప్రేమవ్యవహారం తెలుస్తూనే పూనకమొచ్చినట్లుగా ఆవేశంతో ఊగిపోయిన వారి పెద్దలు వీళ్లిద్దరినీ విడదీసేందుకు శాయశక్తులా ప్రయత్నించారు.

పెద్దల ఆగ్రహావేశాలకి తమ ప్రేమ ఎక్కడ బలవుతుందోనని భయపడిన రాముడు, సీతాలు వెంటనే ఊరవతల వున్న కోదండ రాముని గుళ్ళో మనువాడేసి ఆ తరువాత ఆశీర్వాదంకోసం పెద్దల ముందు మోకరిల్లారు.

మెళ్ళో దండలతో తమ ఎదురుగా నిలబడిన ఈ ప్రేమ జంటని చూసిన రెండు కుటుంబాలవారూ నిర్ఘాంతపోయారు. ఆ మరుక్షణమే ఏం జరుగుతోందో అర్ధం చేసుకునేలోపే ఆవేశంతో రాముడి ని వంగదీసి అతని వీపు మీద తన పిడిగుద్దులు గుద్దసాగాడు సీతాలు అన్న వెంకటేశు.

మరో ప్రక్క సీతాలు ని జుట్టు పట్టుకుని లాగి వాతలు తేలేటట్టుగా ఆమె చెంపలని వాయించసాగింది రాముడి తల్లి రాజమ్మ. అది చూస్తూనే రాముడి రక్తం సలసలా మరిగిపోగా బావమరిది ముష్టిఘాతాల నుండి ఎలాగో తప్పించుకుని , పరిగెత్తుకుని వెళ్లి తన తల్లి చేతుల నుండి సీతాలుని విడిపించాడు.

***

అంత అవమానం జరిగిన తరువాత యిక ఆ ఊళ్ళో ఉండడానికి మనసొప్పక వాళ్ళిద్దరూ రాజమండ్రికి వచ్చేసి చిన్న యింటిని అద్దెకి తీసుకుని కాపురముండసాగారు. రాముడు ఆటోని అద్దెకి తీసుకుని నడుపుతుండగా , చుట్టుప్రక్కల వాళ్లకి కుట్టుమిషన్ మీద బట్టలు కుట్టసాగింది సీతాలు. అలా యిద్దరి సంపాదనతో వారికి రోజులు సుఖంగానే గడిచిపోతున్నాయి. అప్పుడప్పుడూ రాత్రుళ్ళు రాముడు ఒక చుక్క నోట్లో వేసుకుని యింటికి రావడం మినహాయిస్తే చిలకా గోరింకల్లాగా అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు ఆ ఆలుమగలు.

తనకి ఊహ రాకముందే తల్లిదండ్రులు చనిపోగా స్వంత కూతురికిమల్లే తనని అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసిన అన్నావదినలు కళ్ళల్లో మెదులుతున్నా కూడా, తన అన్న చేతుల్లో జరిగిన పరాభవాన్ని రాముడు దాదాపు సంవత్సరం కావొస్తున్నా యింకా మర్చిపోకపోవడంతో మొగుడి ముందు తన వాళ్ళ ప్రస్తావనని తీసుకురావడానికే భయపడేది సీతాలు.

***

ప్రక్కింటి చిట్టి కి పరికిణి, జాకెట్టు కుట్టమని వాళ్ళ అమ్మ ప్రక్కింటి పార్వతి యిచ్చిన సిల్కు బట్టకి మ్యాచింగ్ లేసులని కొనితేవడానికని రోడ్డు మీద వున్న ఫాన్సీషాప్ కి బయలుదేరింది సీతాలు. యింటినుండి నాలుగడుగులు వేసిందో లేదో ప్రక్కసందులోని పాడుబడిన యింటి ముందర మొగుడి ఆటో కనబడడంతోటే హుషారుగా అటుకేసి నడిచింది.

అక్కడ ఆటోకి అటువేపున నిలబడ్డ రాముడి భుజం మీద చేయేసి యిరగబడి నవ్వుతున్న ఆడమనిషిని చూసి అవాక్కయింది సీతాలు. కాళ్ళకి హై హీల్స్, స్లీవ్ లెస్ జాకెట్టు ని ధరించి ఆధునికంగా వున్న ఆ ఆడది తన మొగుడితో అంత చనువుగా వుండడం ఆమె మనసులో ఏదో తెలిని గుబులుని కలిగించింది.

పరాయిఆడదానితో రాసుకుపూసుకుని మాట్లాడుతున్న మొగుడిని చూస్తూనే ' రాముడి గురించి పూర్తిగా తెలికుండానే అయినోళ్ళందరినీ కాదని ఆడిని మనువాడి ఆడితోటి వొచ్చేసి తప్పు చేసానా ' అనిపించింది సీతాలుకి ఒక్క క్షణం. అంతలోనే మళ్ళీ ' ఛ ఛ , నా రాముడు అట్టాంటోడు కాదు. ఆడు బంగారం ' అంటూ తనకి తానే సర్ది చెప్పుకుంది.

" నువ్వు మా యింటికాడకి రావొద్దే పిల్లా. సీతాలుకి అనుమానమొత్తాది. మళ్ళా ఈడే కలుద్దాం " అంటూ ఆ ఆడదాని చేతుల్లో డబ్బులని పెడుతున్న మొగుడి మాటలని వింటూనే ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. మొగుడే సర్వస్వం అనుకుని అందరినీ వదిలేసి వచ్చిన తనని అతనే మోసం చేస్తుండేటప్పటికి తనని గారాబంగా , కంటిపాపలా చూసుకున్న అన్నావదినలు గుర్తుకురాగా ఆమెకి దుఃఖం ముంచుకొచ్చింది. నీళ్ళతో నిండిన ఆమె కళ్ళకి ఆ ఆడమనిషిని ఆటో లో ఎక్కించుకుని వెళ్తున్న రాముడి ఆటో మసకమసకగా కనిపిస్తుంటే చేష్టలుడిగినట్లుగా నిలబడిపోయింది.

ఆ రాత్రి కి ఆలస్యంగా యింటికి చేరుకున్న మొగుడి చేయి తన నడుంమీద పడగానే గట్టిగా విదిలించికొట్టింది సీతాలు.

"దీని సిగతరగ, ఏటయ్యింది దీనికియ్యాల? ఆడినెవడినో తగులుకుందిగా. యింకాడు తప్ప దీని కళ్ళకి నేనానను కామోసు " అనుకున్న రాముడికి మనసంతా చేదు తిన్నట్లుగా అవడంతో ముసుగేసుకుని పడుకున్నాడు. ఉదయం నుండి రాత్రి దాకా ఆటో

ని నడిపి బాగా అలిసిపోయాడేమో క్షణాల్లో నిద్రలోకి జారుకున్నాడు.

“ ఆ టిప్పుటాపు షోకిల్లాకి మరిగాడుగా.      యింక నాతో ఏం పని? అందుకే మరి ఒళ్ళెరక్కుండా తొంగున్నాడు “ అనుకుంటూ కోపంగా అటు తిరిగి పడుకుంది సీతాలు.

***

ఉదయం లేచి పనికి వెళ్ళడానికి తయారవుతున్న రాముడికి వంటింట్లో నుండి ఎత్తెత్తి పడేస్తున్నట్లుగా గిన్నెల శబ్దం పెద్దగా వినిపిస్తుంటే “ సీతాలుకి ముక్కు మీదే వుంటాది కోపం. కానీ దాని కోపం తాటాకు మంటల్లే ఎంటనే సల్లారిపోతాదే . మరీ తడవ ఏట్టైందో దీనికి “ అనుకున్నాడు మనసులో.

అంతలోనే సీతాలు నిన్న వేరే మగోడితో చనువుగా మసలడం గుర్తుకి రాగా “ ఒసేయ్ సీతాలూ “ అంటూ పెళ్ళాన్ని నిలదీయబోయేంతలోనే      “ ఏరా రాముడూ , ఏటి ఆలస్యం ? బేగి రా. బేరం తెచ్చా “ అంటూ ప్రక్కింటి వీరేశం కేకేయడంతో బైటకెళ్ళిపోయాడు.

“ అయ్యో , రేతిరి కూడా బువ్వ పెట్టలేదాడికి. యిప్పుడు నాస్తా అయినా పెట్లేదే “ అనుకుంది సీతాలు.

మళ్ళా వెంటనే మొగుడు నిన్న      వేరే ఆడదానితో సరసాలాడుతున్న దృశ్యం కళ్ళల్లో కదలడంతో      “ ఆడు ఏరేదానితో కులుకుతూ ఖుషీ చూసుకుంటుంటే నేనేనా ఏడుస్తూ యింట్లో కూకునేది “ అనుకుంటూ గబగబా తయారై రోషంగా తనూ బైటకెళ్ళిపోయింది.

***

మిట్టమధ్యాహ్నం వేళ పగలబడి నవ్వుకుంటూ శీనుతో కలిసి పెద్ద బజార్లో వున్న ఫోటో స్టూడియోలోకి వెళ్తున్న సీతాలుని చూసిన రాముడు      ‘ నాయాల ఈ రోజు దీని సంగతి తేల్చేయాలి ‘      అనుకుంటూ ఆటో ని మార్కెట్ కి ఒక ప్రక్కగా ఆపి      కోపంగా స్టూడియో వేపు రెండడుగులు వేసాడో లేదో “ ఏరా రాముడూ , చాన్నాళ్ళైందిరా      నిన్ను సూసి. బాగున్నవురా ? చెల్లెమ్మ

ఎట్లుంది? నన్ను కూసింత కొత్తగా కడుతున్న ఆ బిల్డింగ్ కాడ దింపరా " అంటూ స్నేహితుడు కొండడు ఎదురవడంతో అతనితో పాటు ఆటోని పార్క్ చేసిన చోటికి నడిచాడు రాముడు.

***

బ్యాంకు నుండి బైటకొస్తున్నసీతాలుకి అప్పుడే బ్యాంకు ముందాగిన రాముడి ఆటోని, అందులోనుండి దిగుతున్న ఆడదాన్నీ చూస్తూనే కడుపు మండిపోయి వాళ్ళిద్దరినీ అలాగే చూస్తుండిపోయింది.

తనని చూసి పట్టుబడిపోయినట్లుగా ఉలుకూపలుకూ లేకుండా బ్యాంకు మెట్లమీదే నిలబడిపోయిన సీతాలునీ, దాని ప్రక్కనే వున్న మగోడిని చూస్తూనే అరికాలి మంట నెత్తికెక్కింది రాముడికి.

అంతే , పట్టలేని ఆవేశంతో సీతాలుని జుట్టు పట్టుకుని లాగాడు.

" ఎవడే ఆడు ? ఎంతకాలం నుండీ సాగుతోందీ యవ్వారం " అంటూ సీతాలుని ఎడాపెడా కాళ్ళతో తంతూ అందిన చోటల్లా కొట్టసాగాడు. మధ్యలో అడ్డొచ్చిన శీనుకి కూడా కొన్ని దెబ్బలు తగిలాయి.

ఎలాగో రాముడి దెబ్బల నుండి అతికష్టం మీద తప్పించుకుంది సీతాలు.

" ఆడు నా పెద్దమ్మ కొడుకు, శీను. పోయిన్నెలే దుబాయినుండి వొచ్చిండు. ఆడి కాడ బోల్డు దుడ్లున్నై. దుడ్లెట్టా కూడబెట్టాలో, ఆటిని ఎట్టా దాచాలో ఆడికి బాగా ఎరిక. నేను దుడ్లని యాడ దాచినా సరే ఎతుక్కుని తీసుకెళ్ళి త్రాగుడికి తగలేస్తావాయే నువ్వు. అందుకే బ్యాంకి లో దాసుకోమని నా చేత బ్యాంకి లో అకౌంట్ తెరిపిచ్చిండు మా అన్న. దుడ్లని ఎట్టాగో జమ చేసి మన పెళ్లి రోజుకల్లా నీకు సిల్కు జుబ్బా కొనాలని నేనేదో తంటాలడుతుంటే నీ గోలేందిరా మధ్యన? జబ్బలమీదికి జాకెట్టు ఏసుకుని , మొహానికి రంగేసుకుని టిప్పుటాపుగా తిరిగే ఈ సిగ్గూశరం లేనిదానితో యవ్వారం నడుపుతున్నది నువ్వు కాదూ, థూ నీ జిమ్మడ " మొగుడిని ఛీత్కరించింది సీతాలు.

" ఛీ ఛీ , ఏం నోరే నీది. అన్నాచెల్లెళ్ళకి రంకు అంటగడుతున్నవు . అది మా చిన్నాన్న బిడ్డ శాంత. బోల్డు సదువుకుని ఈ

నడమే మునిసిపల్ ఆఫీసులో కొలువుకి చేరిందది "

" అట్టయితే మరారోజు దానిచేతిల దుడ్లెడుతూ ' సీతాలుకి తెలీకుండా ఈడే కలుద్దాం ' అని దానికెందుకు చెప్పినవ్?" సీతాలు మాటలకి క్షణకాలం    నివ్వెరపోయిన రాముడు పెద్దగా నవ్వేసాడు.

" పిచ్చి మొద్దూ, నీకు చెంకీల చీర అంటే పిచ్చి మోజు కదే.    మూడు దినాల్లో వస్తున్న మన పెళ్లి రోజుకి నీకట్టాంటి చీరని కొని తెమ్మని చెప్పి శాంత చేతికి డబ్బులిచ్చిన, ఆడోళ్ళ చీరెలు దానికైతే బాగా తెలుస్తయని "

మొగుడిని అనవసరంగా అనుమానించినందుకుగాను సిగ్గుపడింది సీతాలు. సీతమ్మలాంటి తన పెళ్ళాన్ని తప్పుగా అర్థంచేసుకోవడమే కాకుండా ఆమె మీద చేయి కూడా చేసుకున్నందుకు బాధపడ్డాడు రాముడు.

" ఏమిటిది సీతాలూ, ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్తని అనుమానించడం తప్పుకాదూ " అంటూ హితవు చెప్పబోయిన చెల్లిని మధ్యలోనే అడ్డుకున్నాడు రాముడు.

" సీతాలునొక్క మాటన్నా నేనొల్లను శాంతా. దాని తప్పేం లేదు. అసొంటి పరిస్థితుల్లో ఏ పెళ్లామైనా సరే అట్టాగే అనుకుంటాదిలే " అన్నాడు పెళ్ళాంని వెనకేసుకునొస్తూ.

" రాముడూ , కోపాన్ని అదుపులో పెట్టుకోవాలే గానీ ముందూ వెనకా ఆలోచించకుండా    పెళ్ళాన్నలా గొడ్డుని బాదినట్లుగా బాదేస్తే తగలరాని చోట దెబ్బ తగిలిందంటే ప్రాణాలకే ప్రమాదం కదూ " అని అంటున్న శీనుని ఆపేసింది సీతాలు.

" ఊరుకో అన్నా, ఆడు    నా మొగుడు.    నన్ను కొడతాడు , సంపుతాడు, అది ఆడిష్టం . మా ఆలుమగల యవ్వారంలో నువ్వెందుకు తలదూరుస్తవ్? అయినా ఈళ్ళతో మనకేంటి రాముడూ , మనం పోదాం పా " అంది సీతాలు.

వీళ్ళ మానానికి వీళ్ళని వదిలేసి చెట్టాపట్టాలేసుకుని చిలకాగోరింకలకిమల్లే ముచ్చట్లాడుకుంటూ వెళ్తున్న ఆ ఆలుమగలని చూసి ముక్కున వేలేసుకున్నారు శీను, శాంత.




నెమ్మదిగా కళ్ళు తెరిచాడు శేఖరం.ఏదో రైల్వే స్టేషన్.జనాలు గుంపులు,గుంపులుగా కదులుతున్నారు.అంతా మసగ్గా ఉంది.కళ్ళు నులుముకుని చూశాడు.అయినా ప్రయోజనం లేదు.ఇంకా అంతా మసకగానే కనబడుతోంది.అసలు ఏమైందబ్బా అని తల గోక్కుందామనుకున్నపుడు ,తల కొంచెం నెప్పిగా అనిపించింది.తాను రైల్లో టాయిలెట్ కి వెళ్ళిరావడం వరకు గుర్తుంది.తర్వాత ఏం జరిగిందో మాత్రం శేఖరానికి ఎంత ప్రయత్నించినా గుర్తుకు రావడం లేదు.పైగా కళ్ళు మసగ్గా కనబడుతున్నాయి.ఏం జరిగిందో తాను మరో సారి తీక్షణంగా గుర్తు చేసుకోసాగాడు.అవును, నేను రైల్లో సింగల్ విండో సీట్ లో కూర్చున్నాను.నాకెదురుగా మరొకడు కూర్చున్నాడు.ట్రైన్ అనకాపల్లి దాటింది.నాకెదురుగా కూర్చున్న వాడు,నేను రాజమండ్రి లో ట్రైన్ ఎక్కినప్పటినుండీ, నా వంక అదోలా చూడసాగాడు. అంటే ,నా మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు వంక.నాకు భయంగానే ఉంది, వాడు దొంగ వెధవేమోనని.కానీ అలా అని ఎలా నిరూపించగలను.పైగా రిసర్వేషన్ బోగీ .లైట్స్ ఆపేశారు.మరి కొన్ని వెలగడం లేదు.

దాంతో కాస్త చీకటిగా ఉంది.అందుకే ఈ రాత్రి ప్రయాణాలు వద్దనేది.దేవుడిపై భారం వేసి నిద్ర నటించాను.దాంతో వాడు అదే అదునునుకుని నాకు దగ్గరగా వచ్చి నా మెడ తాకాడు.దాంతో నాకు టక్కున మెలకువ వచ్చి ,ఏయ్ ఏం కావాలి.ఎందుకలా నాకు దగ్గరగా వచ్చావ్ అంటూ గదమాయించేసరికి,సారి .అని వాడు కొంచెం వెనక్కి జరిగి,వాడి స్థానంలో వాడు బుద్ధిగా కూర్చున్నాడు.కాని నేను మాత్రం అలా మెలకువగానే ఉన్నాను.తర్వాత మాట్లాడటానికి ప్రయిత్నించాడు,నేను తల తిప్పేశాను.అయినా పరిచయం చేసుకోవాలని తాగడానికి నీళ్ళు అడిగాడు.ఇవ్వనని ముఖాన చెప్పేశాను.అంతలో అనకాపల్లి వచ్చింది.నాలో కొంచెం ధైర్యం వచ్చింది.విశాఖపట్నానికి గంట ప్రయాణం మాత్రమె మిగిలి ఉంది.

ఎదుటి సీటు వంక ఓ సారి చూశాను.ముఖానికి మంకీ కేప్ పెట్టుకుని మరీ నిద్రపోతున్నాడు.సరే అని లేచి టాయిలేట్ కి వెళ్ళాను.ముగించుకుని బయటకు వచ్చేసరికి వాడు నిల్చునున్నాడు.గతుక్కుమన్నాను.గుండె దడదడలాడింది.సరే అని పైకి ధైర్యం నటిస్తూనే,అడ్డులే అని ముందుకు వెళ్ళబోతూ, వాడి కుడిచేతి వంక చూశాను.చేతిలో ఏదో కర్ర పట్టుకున్నాడు.నేను వేగంగా ముందుకు కదలబోయేంతలో, నడకలో పట్టుతప్పుతుందనగా,వాడు తలపై దభీమని కొట్టినట్టు గుర్తు.అంతే పడిపోయాను.తర్వాత కళ్ళు తెరిచేసరికి,ఇదిగో ఇలా ఈ ఫ్లాట్ ఫారం అరుగుపై కూర్చుని ఉన్నాను.సమోసా,సమోసా అన్న అరుపుతో ఈ లోకంలోకి వచ్చిన శేఖరం,గాబరాగా తన మెడ వంక చూసుకుని చేత్తో తడిమాడు.మెడలో బంగారు గొలుసు లేదు.చుట్టూ చూసుకున్నాడు,తన సామాను కూడా లేదు. మొబైల్ కూడా బ్యాగ్ లోనే పెట్టాడు.నేను అనుకున్నట్టు ఇది వాడి పనే.పోలీసు కంప్లయింట్ ఇస్తాను అనుకుంటూనే,మరో క్షణం ,అవునూ వాడ్ని ఆ రాత్రి ప్రయాణంలో సరిగా చూడను కూడా చూడలేదు.ఛ , ఏంటో ! నాకే ఇలా జరగాలా,అంటూ మళ్ళీ ఓ సారి కళ్ళు నులుముకున్నాడు.ఈ సారి కొంచెం పర్వాలేదు.మసక తగ్గి కొంచెం నయంగానే కనబడుతోంది చూపు.దాంతో ఏదో తట్టినట్టు, ఆ,ఇప్పుడు ఎవర్నైనా పిలుస్తాను.

పిలిచి నా పరిస్థితి చెప్పి నాకు సహాయం చేయమంటాను.నేను ఇప్పుడు ఏ స్టేషన్లో ఉన్నానో తెలుసుకుంటాను. నా ఊరు, అడ్రెస్ చెప్పి, నన్ను ఆ రైలు ఎక్కించమంటాను.అని అటుగా చూశాడు.ఏదో పెద్ద కాయం అటుగా వెళ్ళడం చూసి,ఏవండీ ,సార్ మిమ్మల్నే.చప్పట్లు చరిచి మరీ పిలిచాడు.ఆ భారీ కాయం దగ్గరగా వచ్చి ,క్యా చాహియే భయ్యా ,అందా ఆడ గొంతు.

బితుక్కుమన్నాడు.ఈమె ఆమె !అతననుకున్నానే.నాకు హింది కూడా రాదే.ఎలాగోలా అడుగుతా, తుమ్, తుమ్ అని ఆగిపోయాడు.

హ,హ బోలో.హింది ఆతాహై.అడిగిందామె మళ్ళీ. నేను రాష్ట్రం దాటిపోయానా ఏంటి ఖర్మ.అని తనలో తానే మదన పడుతుండగానే,పాగల్ ఆద్మీ అంటూ ఆ హిందీ ఆమె బిర ,బిరా అక్కడి నుండి వెళ్ళిపోయింది.

సరే, ఈసారి ఇలా కాదు.నాకు వచ్చీ రాని ఇంగ్లిష్లో అడుగుదాం.కొంత ప్రయోజనం ఉండొచ్చు,అనుకుని,మరో సాల్తీ వైపు చూసి,ఏ లింగమూ వాడకుండా హలో ఎక్స్క్యూస్ మి అంటూ పిలిచాడు.ఆ ఆకారం ఆగింది .దగ్గరకి రండి. అదే, కం క్లోసర్ ప్లీజ్ అన్నాడు.ఆ ఆగిన వారు దగ్గరకొచ్చారు.

అరె నేను ఒకర్ని పిలిస్తే ఇద్దరు వచ్చారా.రెండు తలలు కనిపిస్తున్నై.సరేలే అని ఒక ముఖం వైపుకి తిరిగి ,ఐ లాస్ట్ ఎవ్రి తింగ్.ఐ నీడ్ యువర్ హెల్ప్ టు రీచ్ మై హోం.చెప్పాడు.

ఎంటయ్యా నువ్వు నన్ను పిలిచి అటు చూస్తూ మాట్లాడుతున్నావ్.మెంటలా అడిగాడు కోపంగా.

అరె మీరు తెలుగా.సంతోషం.ఏం లేదు సార్ .ఇద్దరూ ఒక లాగే అనిపించారు. అందుకే అలా అటు చూస్తూ మాట్లాడాను.అని, అనీ అనగానే ఆ ఎదుటి వ్యక్తి, ఎంత మాటన్నవురా ,అంటూ టపీమని నెత్తిన మొట్టేశాడు.

అయ్యో అని నెత్తిన రుద్దుకుంటూ,ఆ మొట్టుడికి మూసిన కళ్ళు తెరిచాడు.ఆశ్చర్యం.అధ్బుతం .ఇప్పుడు శేఖర్ కళ్ళకి అంతా స్పష్టంగా కనబడుతోంది.భలే అనుకున్నాడు.కానీ పిలిచినవాడు ఎందుకు మొట్టాడో అర్ధం కాక అతని వైపుకు తిరిగాడు.అతని వైపు చూసి నీళ్ళు నములుతూ, సారీ అన్నాడు.కారణం అతను ఇందాక మాట్లాడింది అతను సంకనెత్తుకున్న కుక్క వైపు చూసి.పైగా ఇద్దరూ ఒకేలా కనబడుతున్నారు అనడంతో అలా మొట్టేశాడని అర్ధమైంది.చుట్టూ చూశాడు.విశాఖపట్నం బోర్డు కనబడింది.హమ్మయ్య.అన్నీ పోయినా సొంతూరులోనే ఉన్నాను.ఇప్పుడు నాకు కొంచెం ధైర్యం వచ్చింది అనుకుంటుండగానే,ఎవరో ఒకతను దగ్గరకొచ్చి,ఏంటి మీరు ఇంకా ఇక్కడే కూర్చున్నారు.కంపార్టుమెంటు లోంచి మీ లగేజి తెచ్చుకోండి,అన్నాడతను యెస్.సెవెన్ బోగీ వైపుగా వేలు చూపిస్తూ. ఆ బోగీ వైపు చూసి ,అవును నేను వచ్చిన రైలు ఇదే.బోగీ కూడా ఇదే.అనుకుంటూ బిత్తర చూపులు చూశాడు అతని వంక.

ఏంటి సార్ అలా చూస్తున్నారు.వెళ్ళండి.వెళ్ళి తెచ్చుకోండి మీ లగేజి.చెప్పాడాయన.

థాంక్ యు.కానీ నా లగేజి లేదు. రైల్లో నా ఎదురుగా సింగిల్ సీట్లో కూర్చున్న ఓ దొంగ వెధవ నా మెడలో చైన్ నొక్కేశాడు.దానికోసం వాడి చేతిలోని స్టిక్ తో నా తలపై కొట్టేశాడు,తర్వాత నా సామాను తీసుకుని, నన్నిక్కడ పడేసి పోయాడు రాస్కేల్.నాతో మాట కలపాలనుకున్నప్పుడూ,మంచి నీళ్ళు అడిగినపుడే అనుకున్న వాడు దొంగ వెధవని. చెప్పాడు కోపంగా.

అబ్బేబ్బే, అదేం లేదు సార్.మీరు పొరబడ్డారు.మీరు టాయిలెట్ కి వెళ్ళి వస్తుండగా ట్రైన్ కుదుపుకి మీరు తూలడంతో బెర్త్ కొనకి మీ తల తగిలింది.దాంతో మీరు స్పృహ తప్పారు.తర్వాత అతనే మిమ్మల్ని పరీక్షగా చూసి ఏం కాలేదని నిర్ధారించుకున్నాడు.అయితే అంతలోనే స్టేషన్ రావడంతో,జనాలు క్రిందకి దిగడానికి, మీరు అడ్డుగా ఉన్నారని.నేనూ ఇంకో ఇద్దరి సహాయంతో దింపి ఇలా అరుగు పై కూర్చోబెట్టాం.నేను టిఫిన్ చేసి,మళ్ళీ మీ దగ్గరకు వద్దామని వెళ్ళాను.అలాగే మిమ్మల్ని ఓ కంట గమనిస్తూనే ఉన్నాలెండి.ఇంతలోనే మీకు స్పృహ వచ్చింది.తల పై దెబ్బ తగలడంతో కళ్ళు మసకబడ్డట్టున్నై.కనుక మీరు ఇలా ఉన్నారంటే కారణం అతనే. చెప్పాడతను.

అది సరే.కానీ ఆ దొంగ వెధవ నా మెడ తడిమినట్టు గుర్తు.

అతను మీ మెడ తడమలేదు.మీ విండో లోంచి వాన చినుకులు వస్తుంటే కాస్త కిందకి దించే క్రమం లో తగిలుంటుంది.అలాగే మీరు అతని చేతిలో చూసింది స్టిక్ కాదు ఊత కర్ర. మీ చైన్ కూడా ఎక్కడికీ పోలా.మిమ్మల్ని దించే క్రమంలో తెగిపోతే మీ జేబులో

శాం.చెప్పాడతను.కాస్త శాంతంగా చూస్తూ.

ఆహా!ఇంతకీ ఇవన్నీ మీకెలా తెల్సు.మీరూ ఆ బోగీలోనే వచ్చారా .

అవును.అది మాత్రమే కాదు.ఇందాకటినుండీ మీరు అంటున్న,అనుకుంటున్న ఆ దొంగ వెధవ కూడా నేనే.ఎందుకంటే మీ ఎదురు విండో సీట్లో ప్రయాణం చేసింది నేనే కాబట్టి.రాత్రి ,నాకు జ్వరం అందుకే నేను స్వెట్టర్ ,మంకీ కేప్ వేసుకున్నాను.మీతో మాటకలిపింది నన్ను కొంచెం పైకి లేపుతారేమోనని,బాత్రూమ్ కి వెళ్దామని .ఓపిక లేక నిలబడలేక పోతున్నానప్పుడు. అలాగే మంచి నీళ్ళడిగింది టాబ్లెట్ వేసుకోడానికి. చెప్పాడు ,చిన్నగా మడిచిన అతని ఊత కర్ర తీసి, అక్కడినుండి నడవడానికి సిద్ధపడుతూ.

ఓ క్షణం,శేఖరం మనసు చివుక్కుమంది.ఉపకారిని అపకారిగా భావించాను.ఏవిటి ఈ ప్రారబ్ధం?అవును, ఎదుటివారిని చూడగానే ఒక అభిప్రాయం ఏర్పరుచుకోవడం, దానిని బట్టి వారిని అంచనా వేయడం. నేను చూసే దృష్టిలోనే లోపం ఉన్నపుడు,నాకు ఎదుటి వారు ఇలా కాక ఎలా కనబడతారు.ఓ పది నిమిషాలు నా కళ్ళు మసకబారేప్పటికి,ఎవరైనా సహాయం చేస్తే బావుండునని తహ ,తహ లాడను.అలాంటిది జ్వరంతో ఉన్న నడి వయసు మనిషి, స్వతహాగా లేవలేని స్థితిలో నా వంక ఆశగా సహాయం కోసం చూస్తే, నేను ఏదో ఊహించుకుని అతన్ని అవమానించాను.కానీ నేను అంత చేసినా అతను నాకు మంచే చేశాడు. మాట కలపకుండా,మనిషిని అంచనా వేయకూడదేమో.యద్భావం తద్భవతి అన్నది నా లాంటి వారి కోసమేనేమో అని మరుక్షణం అతని వైపు చూశాడు.అప్పటికే అతను తన చేతి కర్ర సాయంతో ,చిన్నగా కుంటుతూ చాలా దూరం నడిచేశాడు.చిన్న కన్నీటి పొరతో అతని కళ్ళు మళ్ళీ మసగబారాయి.కానీ తన మసకబారిన బుద్ధికంటే అది పెద్ద మసకగా అనిపించలేదు శేఖరానికి.




మధ్యాన్నం రెండు గంట లవుతోంది .లంచ్ అయిన తర్వాత ఆఫీస్ లో కూర్చొని ఫైళ్ళు చూస్తున్నాను .ఇంతలో నా మొబైల్ మ్రోగింది .

"హలో ! మూర్తి గారేనా మాట్లాడేది ?" ఒక మగ గొంతు వినబడుతోం ది ఆ వైపు నుండి . ఆ గొంతు నేనెప్పుడు విన్నట్లు లేదు .

"చెప్పండి . ఏమిటి విషయం ? " అన్నాను నేను .

నా పేరు యాదగిరి సారూ ! . ఇక్కడ మీకు తెలిసిన వాళ్ళంట . వాళ్ళకి మేజర్ ఆక్సిడెంట్ అయింది " నా గుండె వేగంగా కొట్టుకోసాగింది .

" యాదగిరి గారు ! ఎవరు వాళ్ళ పేర్లు చెప్పగలరా ? ఎక్కడ నుండి మాట్లాడుతున్నారు మీరు ? " అన్నాను నేను .

"ఎవరో సూర్యా రావు అంట. మీ స్నేహితుడంట . ఆయన మారుతి ఆల్టో కారుని లారీ టక్కర్ చేసింది . నేను మహబూబ్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్ లో ఉన్నాను . మీ వాళ్ళంతా స్పృహ లేకుండా పడి ఉన్నారు . జడ్చెర్ల దగ్గర ఆక్సిడెంట్ అయింది . మీరు వెంటనే వస్తారా ? " అని మొబైల్ ఆఫ్ చేశాడు .

నాలో సన్నని వణుకు ప్రారంభమయింది . కాళ్ళు చేతులు వణుకు తున్నాయి . నిన్ననే వెళ్ళాడు వాడు కర్నూల్ లో ఏదో పెళ్లి ఉందని . అప్పుడే ఈ ఘోర మైన వార్త వినాల్సి వచ్చింది .

సూర్యా రావు నేనూ ఒకే ఆఫీసు లో పని చేస్తున్నాము . ఆతను పర్చేస్ డిపార్టుమెంటు లో, నేను అక్కౌం ట్సు డిపార్టుమెంటు లో పని చేస్తున్నాము . ఇద్దరమూ ప్రాణ స్నేహితులే అనుకోవచ్చు . వాడు నా చిన నాటి స్నేహితుడే ! లక్కీ గా ఇద్దరం ఒకే కంపనీ లో పని చేస్తున్నాము .

ఆఫీసు లో పర్మిషన్ తీసుకోని నా కార్లో ఇంటికి బయలు దేరాను . మధ్యలోనే శ్రీమతి కీ విషయం చెప్పి రడీ గా ఉండమన్నాను . సూర్య రావు ఇల్లు , నా ఇల్లు పక్క పక్క నే ఉంటాయి . వాడు పెళ్ళాం పిల్లలతో పెళ్ళికి వెళ్లి నట్లున్నాడు . ఓ మై గాడ్ ! పిల్లల కేమైనా అయిందా ! చెల్లెలకి ఎలాగుందో ! భగవంతుడా , వాళ్ళంతా క్షేమంగా ఉండాలి "అని మనసులోనే మొక్కు కొన్నాను .

ఒక్కొక్క సారి జీవితంలో అనుకోని సంఘటనలు ఎదురౌతుంటాయి . వాటిని ఎలా ఫేస్ చెయ్యాలో అర్థం కాదు. అప్పుడే దేవుడు గుర్తుకొస్తాడు . ధైర్యంతో అలాంటి పరిస్థితిల్ని ఎదుర్కొనాలి .

ఇంటికి చేరుతూనే శ్రీమతిని రడీ కమ్మని చెప్పి ,కార్లో ఎక్కి కూర్చొని అత్తాపూర్ ఫ్లై ఓవర్ మీదగా జడ్చెర్ల మెయిన్ రోడ్ మీదకు చేరి కార్ స్పీడ్ పెంచాను . నేషనల్ హై వే గాబట్టి శ్రీమతి మెల్లగా డ్రైవ్ చెయమంటూ ఉంది . దేవుడా దేవుడా అని మొక్కు కొంటు ఉంది పెదాల మీద స్తోత్రాల్ని చెప్పుకొంటూ .

ఏది ఎప్పుడు ఏమి జరుతుందో ఎవరు చెప్పలేరు . అంతా దైవ నిర్ణయ మని , విధి లిఖిత మని మనసులో అనుకొంటూ శ్రీమతి తో గూడా ఇదే మాట అన్నాను . తను ఏమి మాట్లాడ లేదు . భయంగా రోడ్డు వంకే చూస్తోంది.

రెండు గంటల్లో జడ్చెర్ల పోలీస్ స్టేషన్ చేరాము. "ఇక్కడికి ఒక కిలో మీటర్ దూరంలో ఆక్సిడెంట్ అయింది. ఇదే ఆ లారీ , ఆ కార్" అన్నాడు పోలీస్ . రెండు వాహనాలు బాగా గుద్దు కొన్నట్లున్నాయి . ఆల్టో కారయితే నుజ్జు నుజ్జు అయిపోయింది . "FIR బుక్

చేశాము. లారీ డ్రైవర్ ని అరెస్టు చేశాము . ఇంతకీ వాళ్ళు మీకేమవుతారు ? అనడిగాడు లోపలున్న సబ్ ఇన్ స్పెక్టర్ .

"అత ను నా క్లోస్ ఫ్రెండ్ సర్ .ఇంతకి వాళ్ళు .... "

"ఎవరో యాదగిరి అంట , బాగా తెలిసిన వాళ్ళే అని అందరిని మహబూబ్ నగర్ హాస్పిటల్ కి తీసుకెళ్ళాడు . బాగా దెబ్బలు తగిలాయి " అన్నాడు ఎస్ ఐ .

వెంటనే వాళ్ళ దగ్గర సెలవు తీసుకోని మహబూబ్ నగర్ కేసి కారుని నడిపాను.

హాస్పిటల్ కి చేరాక ఆ విషాద దృశ్యం చూడలేక పొయ్యాము . సూర్యా రావు , ఆతని భార్య స్పృహ లో లేనట్లున్నారు . బ్లడ్ ని ఎక్కిస్తున్నారు ఇద్దరికీ . ఎక్కడ చూసినా గాయాలే. అప్పటికే బాండేజి అంతా వేసి ఉన్నారు పిల్లలు వెనక సీట్లల్లో ఉన్నారు గాబట్టి , బతికి పొయ్యారు. మమ్మల్ని చూస్తూనే బావురు మని చుట్టు కొన్నారు . వాళ్లకి ధై ర్యం చెప్పి డాక్టర్ గారిని కలిశాను .

"కేసు చాల సీరియస్ మూర్తి గారు .వెంటనే హైదరాబాద్ కి షిఫ్ట్ చెయ్యాలి .లేదంటే ఇద్దరికీ ప్రాణా ప్రాయమే! అతనికి షుగర్ హై ఉంది . బిపి లో లెవెల్ కి పడి పోయింది . ఆమెకు ముఖమంతా గ్లాస్ ముక్కలు ఇరుక్కు పొయ్యాయి . ఎవరో యాదగిరి అని ఆయన రోడ్డు మిద పడి ఉన్నమీ వాళ్ళ నందరిని వ్యాన్ లో ఇక్కడికి తీసుకొచ్చాడు ."అన్నాడు డాక్టర్ గారు.

వెంటనే ఒక వ్యక్తి చేతుల్లో మందులతో , టిఫిన్ పాకేట్లతో లోపలి కొచ్చాడు .

"ఇతనే యాదగిరి "అన్నాడు డాక్టర్ గారు.

"నమస్కార మండి . మీరు చాలా సహాయం చేశారు . చాలా థాంక్స్ " అన్నాను నేను .

"దాని కేముంది సారూ ! మనం వెంటనే వీళ్ళను హైదరాబాద్ కి తీసుకెళ్ళాలి "అన్నాడు యాదగిరి .

నాకు చాలా భయమేసింది . వెంటనే అంబులెన్సు లు రెండు తెప్పించాను . ఆక్సిజన్ సిలిండెర్ లతో ఇద్దరి ముఖాలకి వెంటిలేటర్ పెట్టారు అక్కడున్న సిస్టర్స్ . అన్నీ సర్దుకొన్నాక ,ఒక గంటలో హైదరాబాద్ వైపు బయలు దేరినాము . యాదగిరి ఒక అంబులెన్సు లో కూర్చొన్నాడు . పిల్లల్లిద్దరు మా కార్ లోనే కూర్చొన్నారు . వెక్కి వెక్కి ఏడుస్తున్న వాళ్ళను సముదాయించడం చాలా కష్టంగా ఉంది .

ఆక్సిడెంట్ కేసు గాబట్టి ప్రవేట్ హాస్పిటల్స్ వాళ్ళు చేర్చు కోరన్నారు నా ఫ్రెండ్ . అందుకే నిమ్స్ ఆసుపత్రి కి తీసుకెళ్ళాను . ఎమెర్జెన్సి వార్డ్ లో ఇద్దర్ని అడ్మిట్ చేసాము . యాదగిరి నా పక్కనే ఉండి , అన్ని సహాయం చేస్తున్నాడు .రాత్రి పది గంటల సమయంలో పిడుగు లాంటి వార్త వినవలసి వచ్చింది . సూర్యా రావు భార్యను డాక్టర్లు సేవ్ చెయ్యలేక పొయ్యారు . సూర్యా రావు ఇంకా అన్ కాంషియస్ గానే ఉన్నాడు . సూర్యా రావు బంధువుల కందరికీ ఈ దుర్వార్త తెలిసి , మార్చురీ నుండి తీసుకెళ్ళే సరికి మరసటి రోజు ఉదయం పది గంటలు దాటింది .

సూర్యారావు విషయం ఇప్పుడే ఏమి చెప్పలేమని అన్నారు డాక్టర్లు . బిపి , షుగర్ కంట్రోల్ కి వచ్చా యన్నారు.

యాదగిరి ని పిలిచి" మీరింక రెస్ట్ తీసుకోండి సర్ . మీకు చాలా ఇబ్బంది కలిగింది . మీ ఋణం ఎలా తీర్చు కోవాలో అర్థం గాలేదు " అని అయన చేతిలో ఒక ఐదు వేల రూపాయలు పెట్ట బోయ్యాను.

యాదగిరి మొహం కొంచెం ఇబ్బందిగా పెట్టి , "నేను పైసల కోసం ఈ పని చెయ్యలేదు సారూ ! ఆ సమయానికి నేను అక్కడే ఉన్నాను . మానవతా దృష్టి తో నేను వాళ్ళకు సహాయం చేశాను . అంతే గానీ ఏదో ఆశిం చి గాదు. " అని సుతారంగా నా చెయ్యి వెనక్కి తోశాడు .

నా కప్పుడు అర్ధ మయింది . ఇతను మామూలు మనిషి గాదని . ఒక దేవుడి రూపంలో వచ్చిన మనిషని .

వారం రోజుల తర్వాత సూర్యారావు ని డిస్చార్జ్ చేశారు . యాదగిరి కి చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకొని అతని అడ్రస్సు వివరాలు అడిగాను . ముందు చెప్పడానికి ఒప్పుకోక పోయినా , రామంత పూర్ , సాయిబాబా గుడిపక్కన మా ఇల్లు అన్నాడు .అతని దగ్గర మొబైల్ ఫోను గూడా లేదు .

సూర్యా రావు భార్య మరణాన్ని తట్టు కోలేక పోతున్నాడు . మానసిక వ్యధతో పిచ్చివాడిలా మారి పొయ్యాడు . ఒక్క రోజు నా దగ్గరికి వచ్చి ఉద్యోగం మానేస్తున్నానని చెప్పాడు . మా పక్క నున్న ఇల్లు గూడా ఖాళీ చేసి పిల్లల్ని తీసుకొని వెళ్లి పొయ్యాడు . మాకు చాలా బాధ వేసింది .

ఒక్కోసారి అనుకోకుండా వచ్చిన సమస్యలు మనుషుల్ని ఎలా కృంగ తీస్తాయో , మానసికంగా వాళ్ళని ఎలా పిచ్చి వాళ్ళని చేస్తాయో సూర్యారావు కథే ఒక ఉదాహరణ .

సూర్యా రావు ని చూసి ఆరు నెలలయింది . గానీ నాకు సూర్యా రావు విషయం కంటే , యాదగిరి గారి మీద ఎక్కువగా నా మనస్సు వెడుతోంది .ఆతను ఎలా ఉన్నాడో , అసలు ఏమి చేస్తున్నాడో అన్న కుతుహలంతో ఒక ఆది వారం రామంత పూర్ సాయిబాబా గుడి దగ్గర వాకబు చేశాను. అక్కడ అతని గురించి చెప్పే వాళ్ళు ఎవరూ లేరు , సరే అని సాయి బాబా గుడి లోని పూజారిని అడిగాను. "యాద గిరి ఇక్కడే ఉండే వాడండి .ప్రతి రోజు గుడికి ఆరతి సమయానికి వచ్చే వాడు . ఆరోగ్యం బాగాలేదని వాళ్ళ స్వస్థలం నల్ల గొండ కి వెళ్లి పొయ్యాడు . ఇక ఇక్కడికి రానని చెప్పాడు" అన్నారు పూజారి గారు.

"అడ్రస్సు ఏమైనా చెప్పాడా అండి " అని అడిగాను నేను.

నల్లోగొండ మునిసిపల్ హై స్కూల్ పక్కనున్న బస్తి లో ఉంటానని చెప్పాడు " ఆన్నారు పూజారి గారు .

సరే నని మళ్ళీ ఇంటి ముఖం పట్టాను .

ఒక్క రోజు అనుకోకుండా సూర్యా రావు దిగ బడ్డాడు. మనిషి చాల హుషారుగా ఉన్నాడు . కళ్ళల్లో గూడా వెలుగు కన్పిస్తోంది . బాగా డబ్బులున్న అమ్మాయిని మళ్ళీ పెళ్లి చేసుకోన్నానని , పిల్లలిద్దర్ని విజయ వాడ హాస్టల్ లో చేర్పించానని , ఇప్పుడు వైజాగ్ లో జాబ్ చేస్తున్నానని చెప్పాడు .

"సరే నువ్వు బాగుంటే మాకు అదే చాలు రా "అన్నాను నేను.

"సరే నీ ప్రాణాలు కాపాడిన యాద గిరి అనే అతను నీకు గుర్తుందా ?" అని అడిగాను.

తల అడ్డంగా ఊపాడు గుర్తు లేదంటూ .

"అతన్ని కలవడానికి రామంత పూర్ వెళ్ళాను . ఎక్కడో నల్గొండ లో ఉన్నాడంట . మనం తప్పని సరిగా అతన్ని చూడడానికి వెళ్ళాలి . వస్తావా ?"అని అడిగాను .

"ఒరేయ్ మూర్తి ! దారిన పొయ్యే దానయ్యల్ని నెత్తి కెక్కించు కొన్నా వంటే నీ పని గోవిందా అవుతుంది . నీ పని నువ్వు చూసుకొంటే నువ్వు బాగు పడతావు " అని చెప్పి వెళ్లి పొయ్యాడు వాడు .

ఆశ్చర్య పొయ్యాను నేను. ముక్కు మొహం తెలియని వాళ్ళ ప్రాణాల్ని రక్షించడమే గాకుండా వారం రోజుల పాటు మనతోనే ఉండి ఏమీ ఆశించ కుండా వెళ్ళిన ఒక మానవతా మూర్తి ని గురించేనా వీడన్నది . నాకు దుఃఖం పొంగు కొచ్చింది . సూర్యా రావు అంటే ఆసహ్యం వేసింది . ఎలాగైనా యాదగిరి ని కలవాలనే దృఢ సంకల్పం నాలో కలిగింది .

కొన్ని రోజుల తర్వాత ఓ ఆది వారం నల్లగొండ కి బయలు దేరాను . మునిసిపల్ హైస్కూల్ పక్కనున్న బస్తి లో విచారించాను . యాదగిరి ఉన్న ఇంటికి ఒకతను తీసుకెళ్ళాడు . ఒక చిన్న పెంకుటిల్లు . ఇంట్లో ఎవరు లేరు . ఒక నులక మంచం మీద చిక్కి శల్యమై పడి ఉన్న యాదగిరి కనబడ్డాడు . యాదగిరి తొందరగా పోల్చుకోలేక పోయినా , అన్ని వివరించే సరికి గుర్తుకు తెచ్చుకొని సంతోషించాడు . వారం రోజుల పాటు అక్కడే ఉండి , యాదగిరిని మంచి హాస్పిటల్ కి తీసుకెళ్ళి సపర్యలు చేశాను . మనిషి వారం రోజుల్లో బాగా తేరు కొన్నాడు .యాదగిరి పెళ్లి చేసు కోలేదు , నా అనే వారు లేరు . వారం రోజుల తర్వాత ఒక ఐదు వేల రూపాయలు చేతిలో పెట్టి ,అవసరం ఉంటే నాకు వాకబు చెయ్యమని నా అడ్రస్సు , ఫోన్ నంబర్ ఇచ్చాను . యాదగిరి కళ్ళల్లో కన్నీళ్ళు ధారా పాతంగా జారుతున్నాయి .

ఈ ప్రపంచలొ ఋణాను బంధాలు చాలా విచిత్రంగా ఉంటాయి . యాదగిరి ఎవ్వరో! నేనెవ్వరో ! గాని ఏదో అనుబంధం మా ఇద్దరిని కట్టి పడేస్తోంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న మాట మా ఇద్దరిమధ్య నిజం గాదని పించింది. ఎక్కడో ఎందుకో ఎవరో మనకు కొందరు తారస పడుతుంటారు.ఎన్నో జన్మల నుండి మనకు వారితో అనుబంధం వుందనిపిస్తుంది.వాళ్ళు చెప్పిన కొన్ని వాక్యాలు మన జీవితాలనే మారుస్తాయి.వాళ్ళతో రెండు క్షణాల పరిచయం మన ఎద లోతుల్ని తట్టి లేపుతాయి.జీవన సత్యాలు కొన్ని మనకు అసత్యాలుగానే అన్పిస్తాయి.అపరిచిత వ్యక్తుల అవ్యక్త సహాయాలు మనం ఇట్టె మరచిపోతాము.వాళ్ళ కోసం మనం మళ్లీ వెతికినావాళ్ళు మాయ మైపోతారు

వాళ్ళే నేమో మనుషుల్లో తిరిగే దేవుళ్ళు !

సరిగ్గా ఆరు సంవత్సరాల తరువాత...

సూర్య రావు మళ్ళీ మా ఇంటికి వచ్చాడు . ఈ సారి కడు దైన్యంగా కనిపించాడు . మాసిన గడ్డం, పాలిపోయిన ముఖం, కళ్ళ కింద నల్లటి చారలు , పాత బడి నలిగి పోయిన బట్టలు తో కన బడ్డాడు .

" రాజులా ఉండే వాడివి . ఏమిటి ఇలా నల్ల పూస అయి పోయ్యా వు?" అని అడిగాను . వాడి కి దుఃఖం పొంగుకొచ్చింది .

"నా జీవితం లో అన్ని విషాదాలే రా ! ధన వంతుల అమ్మాయి అని పెళ్లి చేసు కొంటే , అది ఎవరో బొంబాయి సినిమా డైరెక్టర్ వలలో పడి ముంబయి కి చెక్కేసింది . ఇక నా పిల్లల్ని హాస్టల్ చేర్పించినా చెడు సహవాసాలు మరిగి ఇంటర్ కోర్సు గూడా నాలుగు సార్లు ఫెయిల్ అయి కూర్చొన్నారు . ఏం చెయ్యాలో దిక్కు తో చ డం లేదు " అని అన్నాడు .

"భయ పడద్దురా సూర్యా ! కష్టాలు కల కాలం ఉండవు . కష్టాలు మనుషుల కు కాక పోతే మానులకు వస్తాయా ?" దిగులు పడుతున్న వాణ్ణి చూస్తే జాలేసి , కొన్ని ధైర్య వచ నాలు చెప్పాను.

"మరి నీ పిల్లలు .. "

"నా పిల్లలు ఎం ఎస్ అని అమెరికా కి వెళ్లారు . వాళ్లకి అమెరికన్ యూనివర్సిటీ తరపున స్కాలర్ షిప్ గూడా దొరికింది . పెద్ద వాడికి కాంపస్ సెలక్షన్ లో జాబ్ గూడా వచ్చింది " అన్నాను నేను .

"ఎలాగయినా నువ్వు అదృష్ట వంతుడువిరా!" అన్నాడు వాడు

"నువ్వు మనసున్న మనిషి వి రా అందుకే దేవుడు నీకు మేలు చేశాడు "

"మనందరికంటే ఒక గొప్ప మనసున్న మనిషని నువ్వు చూడడానికి గూడా నోచు కోలేదు రా ! అది నీ దురదృష్టం"

"ఎవరతను "ఆశ్చర్యంగా చూశాడు సూర్యా రావు నా వైపు .

"యాదగిరి గారు" అన్నాను నేను.

సూర్యా రావు కళ్ళల్లో ఉబికి వస్తున్న కన్నీటిని గమనిస్తూనే ఉన్నాను నేను .




"ఏయ్ రజనీ ! నాన్న ఫోనుచేసారు.అమ్మకసలు బాగోలేదని.హాస్పిటల్లో జాయిన్ చేసారట ..మనల్ని వెంటనే రమ్మని చెప్పారు."

"మీరు వెళ్ళండి..యిద్దరం వెళ్ళాలంటే కుదరదు. బాచి గాడి స్కూల్ ?అర్చన ఎగ్జాం.."

“రెండు రోజుల్లో వచ్చేద్దాము.రెండు రోజులకి స్కూల్ అంటుకు పోదులే .నేను ప్రిన్సిపాల్ తో మాట్లాడుతాను.”

“మీరు ఎవరితోనూ మాట్లాడవలసిన అవసరం లేదు.పోయిన నెలా సీరియస్ అంటే వెళ్ళాము.అప్పుడే ప్రిన్సిపాల్ క్లాస్ పీకింది.”

“ఆపద వచ్చినపుడు ఆదుకోవాలి.ఈ పిల్లల చదువులు యెప్పుడు ఉండేవేగా?ముందు బయలుదేరు ..యిప్పుడు సెవెన్ అయ్యింది. టేనోక్లాక్ బస్సుకు వెళదాము.”

“మీరు లక్ష చెప్పండి.యిప్పుడు నావల్లకాదు. రేపు యింట్లో కిట్టీ పార్టీ వుంది.”

“పార్టీ ముఖ్యమా ? అమ్మ ముఖ్యమా?”

“నాకదంతా తెలియదు.మీరు వెళ్ళండి.వాట్స్ యాప్ కాల్ చేయండి.”

“రజినీ !మరీ మూర్ఖంగా బిహేవ్ చేయకు. రెండురోజులేగా?”

“అదే నేనూ చెప్పేది.రెండు రోజుల భాగ్యానికి సకుటుంబ సమేతంగా వెళ్ళాలా?అర్చన ఎగ్జామ్స్ కు ప్రిపేర్ అవుతోంది.”

“దాని ఎగ్జామ్స్ మరో మూడు నెల్ల తరువాతిమాట. ప్లీజ్ నా మాట విను రజ్జీ..”

“రజ్జీ బజ్జీ అని నాకేమీ బిస్కట్లు వేయొద్దుగానీ మీ అమ్మ సంగతి నాకు బాగా తెలుసు.పోయిన నెల సీరియస్ అంటే పిల్లా జెల్లతో పరుగెత్తాము.తీరా వెళ్ళి చూస్తే జ్వరం..మామూలు జ్వరం.రానూ పోనూ ఐదువేలు బొక్క.యిక్కడికీ రమ్మంటే బింకం .ఆపల్లెటూరు ..ఆ పాడు కొంపే స్వర్గం.ఆ స్వర్గంలోనే ...”

“యిప్పుడు అవన్నీ ఎందుకు.పాపం యెంత అవసరం వుందో..ఫోను చేశారు.”

“ఆ చేసారులెండి మహా ఫోను.చిన్నదానికి పెద్దదానికి ఫోన్లు తగలడి చచ్చాయి.ఫోనంట ఫోను.”

“రజిని !ఎందుకు అలా నోరు పారేసుకుంటావు..అమ్మకు ఆపదవస్తే మనకు వచ్చినట్లు కాదా?”

“మనకు ఆపదొస్తే?ఈ పిల్లల చదువులు మన ఆర్థిక యిబ్బందులూ మనకు ఆపదలుకావా?”

“దానికి వాళ్ళేమి చేస్తారు?”

“మాటిమాటికి యిలా ఫోనులు చెయ్యకుండా ..మనబ్రతుకు మనల్ని బ్రతకనిస్తే చాలు.అదే మనకు కొండంత మేలు చేసినట్లు.”

“ఒప్పుకుంటాను.కానీ యిప్పుడు అమ్మకొచ్చిన ఆపదా మనవి ఒకటికావు.ప్రస్తుతం మనం వాదించుకొని బుర్రలు బద్దలు కొట్టుకునే టైం కాదు.”

“కదా?మరి తమరు నా బుర్ర ఎందుకు తింటున్నారో సెలవిస్తే తెలుసుకొని తరిస్తాను.”

“రజిని ! కొంచెం కూల్ గా ఆలోచించు.యివ్వాళ అమ్మకొచ్చిన కష్టం రేపు నీకో నాకో రావచ్చు.ఒకరికొకరు తోడు లేకపోతే బాంధవ్యాలకూ బంధుత్వానికి అర్థం ఉంటుందా?బంధనాలు లేని బ్రతుకులకి తెగిన గాలిపటాలికీ గమ్యం ఉంటుందా?”

“అయ్యా !వేదాంతం రాఘవయ్యగారూ!రాద్దాంతాలు ఆపి వాస్తవానికి రండి.ఈ చిన్న విషయానికి “బ” గుణింతం బట్టిపెట్టించే ప్రయత్నం విరమించుకొని బట్టలు సర్దుకొని బయలుదేరితే బాగుంటుంది.”

“నేను ఒక్కడిని వెళ్ళాననుకో వూరు వూరంతా ముఖంమీద వుమ్మేస్తుంది.నువ్వు కనిపించకాపోతే నానా రకాలుగా అనుకుంటారు.”

“ఎవరో ఏదో అనుకుంటారని నేను రావాలా?”

“అనుకుంటారనికాదు.ప్రతి పనికీ ఒక హద్దు వుంటుంది . అలాగే ఆత్మీయులను ఆదుకోడానికి కూడా ఒక పద్ధతి వుంటుంది. అమ్మా కూతుళ్ళమధ్య ..అత్తా కోడళ్ళమధ్య అన్నాతమ్ముళ్ళమధ్య ..”

“అక్కాచెల్లెళ్ళ మధ్య .. ఇంకా దండకం చదవండి మహానుభావా!ఆపకండి.బస్సు మిస్సయ్యే దాకా మీయిష్టం.”

“అయితే రానంటావు.బాధ పడతావు.ఆలోచించుకో.”

“ఇక్కడ చించు కోనేది ఏమీలేదు. ఆ చించు కోనేది ఏదో తమరే చించుకోండి.కిచన్ లో కత్తెరవుంది. తెమ్మంటారా?”

“ఈమధ్య మరీ సోక్రటీస్ భార్యవైపోయావు.”

“నేనేమీ మారలేదు.మారలేను కూడా.కట్టించుకున్న పాపానికి నేను ఎప్పటికీ మీ భార్యనే.”

“ఇంట్లో మనీ ఎంతవుంది?”

“కట్టలే కట్టలు.సూట్ కేసులో పెట్టనా?బ్యాగ్ లో కుక్కనా?”

“మరీ అంత వెటకారం వద్దు.అవసరానికి చేతిలో వుంటుందని అడిగాను.”

“కిరాణాకొట్టులో యివ్వవలసిన పదివేలు వున్నాయి .మొత్తం వూడ్చేస్తారా?మాకేమైనా?”

“మీరు రేపు బ్యాంకు లో తీసుకోండి.”

“ధన్యోస్మి ఉచిత సలహాల రావుగారూ.ముందు తమరు భోజనం చేయండి.బస్సు మిస్సయితే నన్ను ఆడిపోసుకుంటారు.”

“తినాలనిలేదు.”

“ఎందుకుంటుంది ..మధ్యలో బస్సాగిన చోట బిర్యానీయో ..

తందూరి చికెనో లాగించేయ వచ్చు.నాకు తెలియని ట్రిక్కులా?”

“ఒకప్రక్క అమ్మకు బాగోలేదని ఫోను.ఏమయ్యిందోనన్న ఆందోళన.అందుకే ఆకలిగా లేదు.అంతేకానీ అయినా ఇది బిర్యాని తినే సమయమా?కొంచెం ఆలోచించి మాట్లాడు.”

“అయ్యో తప్పయిపోయింది.తమరిక బయలు దేరితే ఇల్లు సర్దుకుంటాను. రేపు కిట్టీ పార్టీ కూడా వుంది.నేను వెళ్ళి బాచి గాడిని తీసుకురావాలి.మీ ముద్దులకూతుర్ని వెళ్ళమన్నా వెళ్ళదు. స్మార్ట్ ఫోను వద్దని యెంత మొత్తుకున్నా వినకుండా ముద్దులకూతురికి కొనివ్వడమే కాకుండా జియో సిమ్ కూడా వేయించారుగా. అప్పటినుంచి చదువు చంకనాకి పోయింది. అది వుంటే తిండీ తిప్పలు చదువూ సంధ్యలు కూడా గుర్తు రావు.అంతా నా ఖర్మ.”

“సరే ఆఖరుసారిగా అడుగుతున్నాను.ఇదే నీ ఆఖరి నిర్ణయమా?”

“ఆఖరినిర్ణయం కాదు అదే నా అంతిమ నిర్ణయం.”

“ఓకే రజినీ !నేను వూరు చేరగానే ఫోను చేస్తాను. కిరాణా వాడికి కూడా నేను వచ్చాక పే చేస్తానని చెపుతాను.పిల్లలూ నువ్వూ జాగ్రత్తగా ఉండండి.”

*****

బస్ స్టేండులో ఫోనులో మాట్లాడుతున్న రమేష్ బాబు..ఇద్దరు పిల్లలతో ఏడుపు ముఖం తో తలదించుకొని వస్తున్న భార్యను చూస్తూనే ఎదురు వెళ్లి చేతిలోని బ్యాగ్ తీసుకొని దగ్గరకు తీసుకొని నెమ్మదిగా నడిపించు కొచ్చి కూర్చోబెట్టి వాటర్ బాటిలు అందించాడు.

“రజినీ !అమ్మకు ఏమీ కాదు.నువ్వు బాధ పడకు ప్లీజ్ ..” అనునయించబోయాడు రమేష్ బాబు.

అది పబ్లిక్ ప్లేసనికూడా చూడకుండా ఒక్కసారిగా బరస్ట్ అయిపోయింది రజిని.

“నన్ను క్షమించండి.పిచ్చిదాన్లా ప్రవర్తించాను.”

“కూల్ డౌన్ మై డియర్ రజినీ.యిప్పుడు ఏమయ్యిందని యింతగా యిదైపోతున్నావు. నాదే తప్పు.నన్ను నువ్వే క్షమించాలి.”

“దయచేసి ఇంకా మాటలతో చంపకండి.సంస్కారం లేకుండా వాగాను.అర్చన పరీక్షలు ముందుపెట్టుకొని చెత్త ఫోనులో టైం వేస్ట్ చేస్తుంటే చూడలేక దానితో గొడవపడి మనసు పాడు చేసుకున్నాను. సరిగా అదే టైం లో మీరు వచ్చారు.కనీసం ఎలావుందని అడగాలన్న ఇంగిత జ్ఞానాన్ని కూడా కోల్పోయి ప్రవర్తించాను.”

“అయిపోయినదానికి అనవర సంజాయిషీలు వద్దు. అయినా మీరెందుకొచ్చారు? నేను వెళ్ళి అమ్మను అంబులెన్స్ లో హైదరాబాద్ తీసుకొచ్చేద్దామని ప్లాన్ చేసుకున్నాను. నిన్న ఫోన్ చేసిన నాన్నగారితో అప్పుడే చెప్పాను. నా ఫ్రెండ్ బోసు ఏర్పాట్లన్నీ చూస్తున్నాడు.”

“మీ కాళ్ళు పట్టుకొని ఏడ్చేయాలనుంది.”

“ఆపని మాత్రం చేయకు.ఈ మధ్య ఎర్రగడ్డ ఖాళీగా వుందని విన్నాను.హెల్త్ వాలెంటీర్లు చూసారంటే యిద్దరి బ్రతుకులూ కేరాఫ్ పిచ్చాసుపత్రి అయిపోతే పిల్లలు అన్యాయమైపోతారు. అయినా నాన్నగారితో చెప్పాను నీకు చెప్పవద్దని. అయినా?”

“ఆయన్ను యేమీ అనకండి.ఈ స్మార్ట్ ఫోన్ పిచ్చిదానికి  బావ  గారి అమ్మాయి  వాట్స్ యాప్ లో ఫోటో పెట్టింది.ఆ రచనా దీనిలాగే ఫోను పిచ్చిది.”

“ఆహా నెట్ వచ్చాక ప్రపంచమే నెట్ లో పడిపోయింది.ప్రైవసీలేదు సీక్రసీ  లేదు.”

“ఆ మెసేజ్ పెట్టిన తల్లి ఓగంట ముందు పెడితే ఇంత రాద్ధాంతం జరిగేదికాదు.”

“ అసలు ఇంతకీ జరిగి పోయిన రాద్ధాంతమేమిటో..నువ్వు ఏమంటున్నావో నాకు ఒక్కముక్క అర్ధం కావడం లేదు.అమ్మను హాస్పిటల్లో జాయిన్చేసారని చెప్పాను.యిప్పుడు కూడా అదే అంటాను.

వాట్స్ యాప్లో రచన పెట్టిన ఫోటో అయితే మా అమ్మది లేదంటే మీ అమ్మది.దీంట్లో తేడా ఏముంది?ఎవరైనా అమ్మేగా?”

“చచ్చిన పామును ఇంకా చంపాలంటే మీ యిష్టం.”

“అది కాదురా ..యిదంతా చేసింది నీకోసమే.మీ అమ్మగారు  అనుంటే అప్పుడే రాగాలు తీసే దానివి. సీను తారుమారయ్యేది.అయినా మీ అమ్మకీ మా అమ్మకీ తేడా ఏమిటి?అమ్మ అమ్మే కదా?నాకు అత్తగారు నీకు అమ్మగారు. నీకు అమ్మగారు నాకు అత్తగారు.మొత్తానికి యిద్దరూ అమ్మలే. అమ్మ కాని స్త్రీ అత్త యెలా అవుతుంది?యివ్వాళ నువ్వు అమ్మవి..రేపు?అంటే అమ్మ అత్త అవగానే మనిషిలో అంత మార్పు వస్తుందా? మౌనం సమాధానం కాదు భావి అత్తగారు!

అయినా పోస్ట్ గ్రాడ్యుయేటివి. అయినా బుర్ర ఇంకా బీసీ లెవెల్లోనే ఫ్రిజ్ అయిపోయినట్లుంది.అసలు అమ్మాయిలంతా యింతేనా?నువ్వు మాత్రమేనా?దీనికి అంతం లేదా?”

“వదిలేయండి డాడీ..యిదంతా నామూలంగానే జరిగింది.ఈదెబ్బతో నా ఫోను పిచ్చి సగం వదిలిపోయింది.”

“సగంకాదుతల్లీ! పూర్తిగా వదలాలి.అమ్మ చెప్పినా నేను చెప్పినా నీ మంచికోసమే కదా?ముందు చదువు..తర్వాతే ఏదైనా?చదువు వెంట వుంటే సమస్తమూ నీ వెంటే. నేను మీ అమ్మకు అబద్ధం చెప్పింది తన కోసమే.నన్ను తిట్టి అలిసిపోయి నువ్వు ఫోటో చూపించాక అందరికీ ఫోన్లు చేసి సీరియస్ కాదని కన్ఫర్మ్ చేసుకుని వుంటుంది.అది అప్పుడే నేను చెప్పి వుంటే బాగా ఏడ్చేసి తను అప్ సెట్ అయిపోయి మనల్ని కూడా టెన్షన్ పెట్టేసేది.ఫోన్లో తాతయ్యగారు అమ్మమ్మకు అంత సీరియస్ కాదని చెప్పారుకాబట్టే నేను చిన్న డ్రామా ఆడాను. నువ్వు రియలైజ్ అయ్యావు అమ్మ అత్తగారిమీదున్న చెత్త అభిప్రాయాన్ని మార్చుకుంది.నేను వూరెళ్ళాక మీ అమ్మకు ఫోన్లో నిజం చెప్పి క్షమాపణ అడుగుదామనుకున్నాను.యింతలో నువ్వు”

“సారీ డాడ్..మీరు పొరపాటు పడి వుంటారేమోనని చెప్పాను.అప్పటికీ ఫోటో మీకు ఫార్వర్డ్ చేస్తానంటే అమ్మ ఫోను లాక్కుంది.హడావుడిగా తయారై వచ్చేసాము.”

ఏది ఏమైనా అంతా మన మంచికే జరిగింది.

“సారీరా రజ్జి..ఇది బిస్కెట్ కాదు ..”

“డాడీ !అమ్మ బుగ్గలు చూడండి..నేనో గులాబీ కోసి జడలో పెట్టుకోనా?”

“టు సే యస్ ఐ హేవ్ టు టేక్ పర్మిషన్ ఫ్రం యువర్ మాం..మై బాస్.”